నేటి కందం- నేటికి అందం

తీరగు సాధనతోడుత
నేరుగ విజయమును గొనిన నిష్ఠాగుణలౌ
భారత కబడీ జట్టుకు
హారతు లందించుచుంటి నభినందనగన్ !!

(ఢాకాలో చైనా మీద భారత మహిళల కబడ్డీ జట్టు మహోన్నత విజయం సాధించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

చురక

కార్మిక చట్టాలను
కోడ్‌లుగా మార్చింద్రు
హక్కులన్నీ కార్పోరేట్ల
హస్తాల్లో పెట్టింద్రు.
యజమానులు చెప్పిందే
వినాలింకా ఇప్పుడు
పని గంటలు పని భద్రత
ప్రశ్నించొద్దు ఎప్పుడూ



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ బుధవారం 26-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:88 పేజిలు:6 వెల: రూ.1/-


## భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచింది

### -కొనియాడిన ప్రధాని నరేంద్ర మోడీ



ఉత్తర ప్రదేశ్ నవంబర్ 25 (ఎక్సం ప్రెస్ న్యూస్ );: భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందని అన్నారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రసంగం ప్రారంభించారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి ఇవాళ పూర్ణాహుతి అని.. ధర్మధ్వజం కేవలం జెండా మాత్రమే కాదని తెలియజేశారు. ఈ ధర్మధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం అని..సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నం అని ప్రశంసించారు. ఈ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందని, ఈ ధర్మధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుందని అన్నారు. కర్త, కర్మవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెప్తుందని, పేదలు, దు:ఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ధర్మధ్వజాన్ని దూరం నుంచి చూసినా రాముడిని చూసినంత పుణ్యం వస్తుందని, కోట్లాది మంది రామభక్తుల కల ఇవాళ సాకారమైందని మోడీ పేర్కొన్నారు. రామమందిర నిర్మాణానికి సహకరించిన అందరికి నమస్కరిస్తున్నానని, ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగాడో అయోధ్య చెప్తుందని తెలిపారు. రాముడు కులం చూడడు.. భక్తి మాత్రమే చూస్తాడని, ఆ ధర్మ పురుషుడు శ్రీరాముడికి బేధభావాలు ఉండవని అన్నారు. శతాబ్దాల నాటి గాయాలకు ఇవాళ ఉపశమనం లభించిందని, ఐదు శతాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారమైందని అన్నారు. ధర్మధ్వజంపై ఉన్న కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకని ఆనందాన్ని వ్యక్తం చేశారు. మన చుట్టూ కొందరు బానిస భావజాలం ఉన్నవారు ఉన్నారని, బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు అని సూచించారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు భారత్ అని.. శతాబ్దాల క్రితమే భారత్ ప్రజాస్వామ్య విధానం ఉందని అన్నారు. తమిళనాడు ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెప్తోందని, భారత్ లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాము డు ఉన్నాడని గుర్తుచేశారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని.. బానిస భావజాలం ఉన్నవారని చెబుతున్నారని, వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని, అయోధ్య రాముడిని ఇప్పటికే 45 కోట్ల మంది దర్శించుకున్నారని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అయోధ్యలో రామమందిర శిఖరంపై వైభవంగా రామాలయ ధ్వజారోహణం మోడీ ఎగరవేశారు. ఆలయ శిఖరంపై కాషాయ పతాకాన్ని ఆవిష్కరించారు. అభిజిత్ ముహూర్తంలో రామాలయ శిఖరంపై ధ్వజారోహణం చేశారు. 2020 ఆగస్టు 5న రామమందిరం నిర్మాణానికి భూమి పూజ జరిగింది. అయోధ్యలో 2024 జనవరి 22న బాలరాముడి ప్రాణప్రతిష్ట చేశారు. ధర్మధ్వజంపై శ్రీరాముడు, సూర్యుడు, ఓం కోవిదర చెట్టు చిహ్నాలు ఉన్నాయి. ధ్వజారోహణంతో అయోధ్య రామమందిర నిర్మాణం సంపూర్ణమైంది.

## ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చేసింది..

హైదరాబాద్, నవంబర్ 25:తెలంగాణ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయింది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ చీఫ్ రాణి కుముదిని మంగళవారం సాయంత్రం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'తెలంగాణలో కోటి 66 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. సెప్టెంబర్ 29వ తేదీన అనౌన్స్ చేసిన షెడ్యూల్‌ను కొన్ని కారణాల వల్ల నిలిపివేశాము. ఈ రోజు నుంచి ఎంసీసీ కోడ్ అమలులోకి వస్తుంది.

అబ్జర్వర్‌లు, ఎలక్షన్ అబ్జర్వర్‌లను నియమించాం. 31 జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతాయి. డిసెంబర్ 11,14,17 తేదీల్లో పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు పోలింగ్ రోజే ఉంటుంది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. నవంబర్ 27వ తేదీ నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధి ంచిన నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30వ తేదీ నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు' అని తెలిపారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలలో కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం

**42 శాతం నుంచి 22 శాతంకు తగ్గించి బి.సి గొంతు కోశారు.**
**అమలులో చాలా జిల్లాలలో 10 శాతం కూడా అమలు చేయలేదు.**
**నిప్పులు చెరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అద్యక్షులు ఆర్.కృష్ణయ్య**
**రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంగం,రాస్తారోకో,నిరసనలకు పిలుపు**




హైదరాబాద్ నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నిన్న ప్రకటించిన గ్రామపంచాయతీ ఎన్నికలలో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారు. ఇప్పటికే బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 తగ్గించి బీసీల గొంతు కోశారని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతుంటే ఇంకొక వైపు చాలా జిల్లాలో కేటాయించిన 22 శాతం కూడా అమలు చేయడం లేదని ఇది బి.సి.లను నట్టేట ముంచడమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అద్యక్షులు ఆర్.కృష్ణయ్య విమర్శించారు.మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్కర్నూల్ జిల్లాలో 460 సర్పంచ్ పదవుల్లో బీసీలకు 83 మాత్రమే బి.సి.లకు కేటాయించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో 31 గ్రామ పంచాయితీల్లో ఒక సర్పంచ్ కూడా బీసీలకు దక్కని వైనం ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం గ్రామ పంచాయితీ 473లలో బి.సి.లకు 23 మాత్రమే కేటాయించిన కేవలం 11శాతమే సర్పంచ్ పదవులు కేటాయించి దగా చేసారు. అలాగే ఖమ్మం జిల్లాలో కూడా 10 శాతం దాటలేదు.పంచాయతీ ఎన్నికల్లో ఎటువంటి శాస్త్రీయత లేకుండా అధికారులు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లాను యూనిట్ గా తీసుకొని అధికారులు చేసిన మూలంగా బీసీలకు గతంలో జరిగిన పంచాయితీ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో తీరని తప్పుడు విదానాల జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 42శాతం బీసీ రిజర్వేషన్ల మాట నష్టం దేవుడెరుగు కానీ, ఉన్న బీసీ రిజర్వేషన్లకి ప్రభుత్వం గండికోడుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు బీసీ రిజర్వేషన్లను అతితక్కువగా కేటాయించడం మోసం చేయడం కాదా? 2019లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో బీసీలకు 18 నుంచి 22 శాతం వరకు రిజర్వేషన్లను అమలు చేశారని, తాజా ఎన్నికల్లో 16 నుంచి 20శాతం వరకే రిజర్వేషన్లు కేటాయించారని ఆరోపిం చారు. అనేక డివిజన్లు, మండలాల్లో బీసీలకు ఒక్క సర్పంచ్ సీటు కూడా రిజర్వ్ కాలేదని, మండలాల వారీగా చూస్తే పలు జిల్లాలో అనేక మండలంలో గత ఎన్నికల్లో కన్నా బీసీ కోటాను తగ్గించారు. బీసీ రిజర్వేషన్ కోటాను తగ్గించి జనరల్ కోటా రిజర్వేషన్ పెంచారని, బీసీలకు రావాల్సిన సర్పంచ్ స్థానాలను అగ్రకులాలకు కట్టబెట్టే కుట్ర జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన అన్ని రిజర్వేషన్ వివరాలను సేకరిస్తున్నాం, అతి త్వరలోనే తమ కార్యవరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం 10 జిల్లాల్లో ఒక్క సర్పంచ్ స్థానం కూడా బీసీలకు దక్కలేదు. వివరాలు ఇలా మండలాలు -27 యున్నవి. ఇది చాలా దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, తిరుమలాయపాలెం. నల్గొండ జిల్లాలో దామరచర్ల, నేరేడుగొమ్ము, సూర్యాపేట జిల్లాలోచివ్వెంల, పాలకీడు. మంచిర్యాల జిల్లాలో భీమారం, కాసిపేట, కోటపల్లి, మందమర్రి, నెన్నెల. ఆదిలాబాద్ జిల్లాలో బజార్ హత్నూర్, మావల, నేరడిగొండ. సాత్నాల, సోనాల, సిరికొండ. భూపాలపల్లి జిల్లాలోమహాముత్తారం, పలిమెల. మహబుబబాద్ జిల్లాలో కేసముద్రం, కురవి, ఇనుగుర్తి, సీరోలు. డోర్నకల్, మరిపెడ. ఆసిఫాబాద్ జిల్లాలో బెజ్జూర్, నాగర్ కర్నూల్ జిల్లాలో అచ్చంపేట. రంగారెడ్డి అమనగల్లు లో ఒక్క గ్రామా పంచాయితీ కూడా బి.సి.లకు రిజర్వేషన్ దక్కలేదు.గ్రామాలు (జనాభా ఎక్కువగా ఉండడం, రొటేషన్ పద్ధతిలో కలిసిరావడం వల్ల) రిజర్వ్ కాగా.. కొన్ని మండలాల్లో ఒకటి, రెండు గ్రామాలే దక్కాయి. ఇప్ప టివరకు అందిన వివరాల ప్రకారం 27 మండలా ల్లోనైతే బీసీలకు ఒక్క సర్పంచ్ స్థానమూ దక్కలేదు. గతంలోనూ ఇదే పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారయ్యా యని, అప్పట్లోనూ బీసీలకు రిజర్వ్ కాని, మండలాలు ఉండేవని అధికారులు చెప్తున్నారు. కానీ ప్రస్తుతం బీసీ ఉద్యమం బలంగా యున్న బి.సి.లకు అన్యాయం జరిగింది. ఇది సహించరని నేరమన్నారు.నష్టపోకుండా వెంటనే దిదుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.సర్పంచ్ రిజర్వేషన్లను జిల్లాలో యూనిట్ గా కాకుండా మండల యూనిట్ గా తీసుకోవాలి.సీట్ల కేటాయింపులో బీసీలకు జరిగిన అన్యాయం విషయమే తీవ్ర ఆందోళన మొదలైంది. ఇది గమనించి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను వెంటనే మొదలుపెట్టాలి.బీసీ రిజర్వేషన్ల కేటాయింపుపై తిరిగి సమయం ఇచ్చి సరైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు.ఈ సమావేశంలో బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బి.సి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బి.సి ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, రాష్ట్ర బి.సి సంఘం అధ్యకులు రాజేందర్, బి.సి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ళ సతీష్, బి.సి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బానాల అజయ్, బి.సి రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం కార్యదర్శి భీం రాజు,బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఏ.లత , బి.సి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ కుమార్, అంజి గౌడ్, బి.సి యువజన సంఘం ప్రెసిడెంట్ వర్కింగ్ తిరుమల గిరి అశోక్, జక్కా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం



హైదరాబాద్, నవంబర్ 25:ఇంటర్‌నెట్ డెస్క్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.పెద్ద అంబర్ పేట్, జల్‌పల్లి, తుర్కయంజాల్, శంషాబాద్‌లు, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, దమ్మాయి గూడ, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జీగీర్, మీర్‌పేట్, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనం కాబోతున్నాయి. మరోవైపు మూడో డిస్కం ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

కేబినెట్ నిర్ణయాలివే..

1. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీ ఉ ఊఓఅలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

2. రాష్ట్రంలో ఇప్పుడున్న ఔఖఆఅఒ, ాఖఆఅఒ రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి.

3. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేళ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాపై కేబినెట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్ విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది.

4. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది.

ఐదేళ్ల కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంఓయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.

5. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది.

6. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్ లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూ నిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది.. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో.. ముందుగా అం చనాలు వేసుకుని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

7. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం ఉఊఓఅ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14,725 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించి.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది.

8. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

9. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

10. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీలతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం.

## కొనుగోలుదారులకు చుక్కలు.. ఒకేరోజు భారీగా పెరిగిన పసిడి, వెండి ధరలు..!

హైదరాబాద్ నవంబర్ 25 (ఎక్సం ప్రెస్ న్యూస్ );పసిడి ధరలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే ఆకాశన్నంటిన ధరలతో సామాన్యులు బంగారమంటేనే బెంబేలెత్తిపోతున్నారు. గత మూడు రోజుల కాస్త ఊరటనిచ్చిన ధరలు తాజాగా.. ఒకేరోజు అమాంతం పెరిగాయి. మూడు రోజుల నష్టాల తర్వాత దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల తులం బంగారం రూ. 3500 పెరిగి తులం రూ.1, 28,900కి పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.3500 పెరిగి తులానికి రూ.1,28,300కి చేరుకుంది. ఇక వెండి సైతం బంగారం బాటలో దూసుకుపోతున్నది. ఒకే రోజుకు రూ.5,800 పెరిగి.. కిలో ధర రూ.1,6 0,800కి పెరిగింది. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో స్థానిక ఆభరణాల వ్యాపారుల నుంచి డిమాండ్ పెరిగిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.ప్రధాన కరెన్సీలతో పోలిస్తే యూఎస్ డాలర్ బలహీనపడడం బంగారం ధరల పెరుగుదలకు దారి తీసిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు. విదేశీ మార్కెట్‌లో ఔన్సు బంగారం 0.09 శాతం తగ్గి 4,131. 09 డాలర్లకు చేరుకుంది. ఇక వెండి 0.40 శాతం తగ్గి ఔన్సుకు 51.15కి తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా స్థిరమైన ట్రెండ్ మధ్య మంగళ వారం ఫ్యూచర్స్ ట్రేడ్‌లో బంగా రం ధరలు రూ.1,458 పెరిగి రూ.125, 312కి చేరాయి. వచ్చే నెలలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును తగ్గిస్తుందనే అంచనాలు మరింత పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (లో డిసెంబర్ డెలివరీకి సంబం ధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 1.18 శాతం పెరిగి రూ.1,25,312కి చేరుకుంది.అలాగే, సిల్వర్ ఫ్యూచర్స్ కొనుగోళ్ల కారణంగా.. డిసెంబర్‌లో డెలివరీకి వెండి ధర 1.67 శాతం పెరిగి కిలోకు రూ.1, 57,065కి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో డిసెంబర్‌లో డెలివరీకి కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్సుకు 47.8 పెరిగి 4,142 డాలర్లకు చేరింది. డిసెంబర్‌లో డెలివరీకి కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ 1.94 శాతం పెరిగి ఔన్సుకు 51.30 డాలర్లకు పెరిగింది. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ.. మంగళవారం బంగారం ధరలు ఔన్సుకు 4,140 డాలర్లకు చేరిందన్నారు. గత సెషన్‌తో పోలిస్తే లాభాలను నమోదు చేశాయన్నారు. ఫెడ్ వైఖరి నేపథ్యంలో వచ్చే నెలలో వడ్డీ రేటు తగ్గింపు అంచనాలు పెరిగాయన్నారు.డిసెంబర్‌లో 25 బేసిస్ పాయింట్ల రేటు కోత అవకాశం 81 శాతం ఉంటుం దని ట్రేడర్స్ ఆశిస్తు న్నారని.. వారం కిందట 40 శాతం నుంచి గణనీయంగా పెరిగిం దని త్రివేది తెలిపారు. డాలర్ ఇండెక్స్ స్థిరంగా ఉందని, 100 మార్కు పైన ట్రేడవుతోందని.. రష్యా-ఉక్రెయిన్ శాంతి ఒప్పం దంపై అంచనాలు బంగారం, వెండి లాభాలను పరిమితం చేస్తోందని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ కమోడిటీస్ వైస్ ప్రెసి డెంట్ రాహుల్ కలాంత్రి అన్నా రు. బులియన్ ధరల భవిష్య త్తుపై అంచనా వేయడానికి పె ట్టుబడిదారులు కీలకమైన యూ ఎస్ డేటా కోసం ఎదురు చూస్తున్నారని రిలయన్స్ సెక్యూరిటీస్ త్రివేది చెప్పారు. సెప్టెంబర్ రిటైల్ అమ్మకాలు, ఉత్పత్తిదా రుల ధరల సూచిక డేటా, నిరుద్యోగ వాదనలు అమెరికా ఆర్థిక వ్యవస్థ, ద్రవ్య విధానంపై ఫెడ్ వైఖరి ఎలా ఉండబోతుందో తెలుస్తుందన్నారు.

# అమూల్ సృష్టికర్త డా॥ వర్గీస్ కురియన్

## (26 నవంబర్ "జాతీయ క్షీర దినోత్సవం" సందర్భంగా)

అందాల పాపను చూసి "అముల్ బేబీ" అని ముద్దుగా పిలవడం మనకు అలవాటు. అముల్ బ్రాండ్ అంటే తెలియని భారతీయులు ఉండరు. అంతటి మహత్తర అముల్ సృష్టికర్త వర్గీస్ కురియన్‌ను గుర్తు చేసుకోవడం మన కనీస కర్తవ్యం. భారత శ్వేత విప్లవ పితామహుడు (ఫాదర్ ఆఫ్ వైట్ రెవొల్యూషన్) డా: వర్గీస్ కురియన్ జన్మదినం 26 నవంబర్ రోజున ప్రతి ఏట దేశవ్యాప్తంగా "జాతీయ క్షీర దినోత్సవం లేదా నేషనల్ మిల్క్ డే" పాటించుట ఆనవాయితీగా మారింది. పాలు, పాల ఉత్పత్తుల్లో పోషక విలువలు, నిత్యం పాలు తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పాల ఉత్పత్తులను పెంచే మార్గాలు, పాడి పరిశ్రమల లాభసాటి నిర్వహణ, పాల ఉత్పత్తిదారులను కొనియాడడం, పాడి పరిశ్రమను వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా రైతులకు పరిచయం చేయడం లాంటి ప్రధాన అంశాలను ప్రచారం చేయడమే లక్ష్యంగా జాతీయ క్షీర దినం వేదికలను వినియోగిస్తారు.

### 'అముల్ డైరీ' సృష్టికర్త డా: వర్గీస్ కురియన్:

భారత్‌లో శ్వేత విప్లవానికి నాంది పలికిన డా: వర్గీస్ కురియన్ కృషితో నేడు పాల ఉత్పత్తుల్లో మన దేశాన్ని అగ్ర స్థానంలో నిలిచింది. కోట్ల పేద రైతుల కుటుంబాల దృష్టిని పాడి పరిశ్రమ వైపుకు మరల్చి, వారి కుటుంబాల్లో/జీవితాల్లో వెలుగులు నింపి, పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేసి, భారతీయుల ఆరోగ్యాలను కాపాడిన మహోన్నతుడిగా కురియన్ సేవలను కొనియాడాల్సిందే. కురియన్ దూరదృష్టి, దార్శనికత ఫలితంగా "నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు" ఏర్పడడం, దాని వ్యవస్థాపక చైర్మన్‌గానే కాకుండా గుజరాత్‌లో "కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(అముల్ డైరీ)" స్థాపన, "ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్" స్థాపన, "అల్లహాబాదు సెంట్రల్ యూనివర్సిటీ" విసీగా పని చేయడం లాంటి అమూల్య సేవలతో తన జీవితాన్ని ఆసాంతం దేశాభివృద్ధికి అంకితం చేశారు. తను చూపిన సహకార పాల ఉత్పత్తుల ఉద్యమం ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా అల్పాదాయ దేశాలకు కూడా దారి దీపంగా మారడం హర్షదాయకం.

### కోజికోడ్ నుంచి అముల్ దాకా ప్రస్థానం:

దార్శనికుడు, విలక్షణ ఆలోచనాపరుడు, సామాజిక ఔత్సాహికవేత్త, పేదల పక్షపాతి, నిరంతర శ్రామికుడు, మేధావి అయిన వర్గీస్ కురియన్ 26 నవంబర్ 1921న కోజికోడ్, కేరళలో జన్మించారు. అకుంఠిత దీక్షతో సహకార పాల ఉత్పత్తి సంఘాన్ని ఏర్పాటు చేసి, 1946లో అముల్ డైరీ రూపంలో ప్రపంచంలోనే అతి పెద్ద పాల సహకార సంఘాన్ని స్థాపించిన మహానుభావుడు కురియన్. ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కురియన్ కృషితో పాల ఉత్పత్తిదారులు ఊపిరి పీల్చుకోవడం, పాల ఉత్పత్తులతో తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవడం, పాడి పరిశ్రమను లాభాల బాటన నడిపించడం, మధ్యవర్తుల ఆగడాలను అరికట్టడం, మార్కెటింగ్ సౌకర్యాలు పెంచడం, పాడి రైతులకు దిశ నిర్దేశనం చేయడం లాంటి సత్కార్యాలను సుసాధ్యం చేసిన కురియన్ సేవలు మరువలేనివి. కురియన్ కృషితో ప్రపంచంలోనే అతి పెద్ద "ఆపరేషన్ ఫ్లడ్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. కురియన్ చొరవతో దాదాపు 30 సంస్థలు ఏర్పడడం, వాటిని రైతులు/శ్రామిక వర్గాలు నడపడం జరుగుతోంది. అముల్ బ్రాండ్ విజయవంతం కావడంలో వర్గీస్ సేవలే ప్రధానం.

కురియన్ కృషిని గుర్తించిన పౌర సమాజం ఆయనకు పద్మశ్రీ, పద్మభూషన్, పద్మ విభూషన్, రామన్‌మెగసెసె, కృషి రత్న, వరల్డ్ ఉ?డ్ ప్రైజ్ లాంటి పురస్కారాలను అందజేశాయి.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రైతును రాజును చేసే పంచ సూత్రాలు..

### అయిదు విధానాలతో స్పష్టమైన కార్యాచరణ
### రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### అగ్రీ టెక్‌కు అన్నదాతలు చేరువకావాలి
### సాగు విధానాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి
### –జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

అమరావతి, నవంబర్ 25: వచ్చే అయిదేళ్లలో రైతును రాజును చేసేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే

ఆహార అలవాట్లకు అనుగుణంగా అన్నదాతలు సాగు పద్ధతులను మార్చుకోవాలని, చిరుధాన్యాల సాగుతో పాటు ఉద్యాన



అయిదు విధానాలతో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో కలిసి పెనుగంచిప్రోలు మండలం, శనగపాడు రైతుసేవా కేంద్రంలో మంగళవారం జరిగిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతన్నా.. మీ కోసం కార్యక్రమం అమలు లక్ష్యాలను అధికారులు వివరించారు. ఆత్మీయులైన అన్నదాతలకు నా హృదయపూర్వక నమస్సులు.. మీరు పండించే ప్రతి గింజ, ప్రతి పంటా మన రాష్ట్రానికి బలం అంటూ వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధికి ప్రభుత్వం చూపుతున్న చొరవను వివరిస్తూ ముఖ్యమంత్రి రాసిన లేఖను చదివి వినిపించారు.

వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, చీడపీడల నియంత్రణ, సాగునీటి సక్రమ నిర్వహణ, వాతావరణ సూచనలు.. ఇలా వివిధ అంశాలు నిక్షిప్తమైన, రైతులకు ప్రయోజనకారిగా ఉండే ఏపీ ఏఐఎంఎస్ యాప్ గురించి కూడా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. సమాజంలో నేడు మారుతున్న పంటలపైనా దృష్టిసారించాలన్నారు. సాగుకు సాంకేతికత తోడైతే తిరుగుండదని.. అందుకే అగ్రీ టెక్ విధానాలను అనుసరించాలని సూచించారు. డ్రిప్, స్ప్రింకర్ల సేద్యాన్ని విస్తరించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని 40 శాతం 50 వరకు పెంచి రైతు ఉత్పాదకతలో ప్రగతికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

అన్నదాతలు అగ్రిప్రెన్యూర్‌గా ఎదగాలని.. తమ ఉత్పత్తులకు విలువను జోడిస్తే మార్కెట్లో అధిక ధరలు లభిస్తాయన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన వాతావరణ ఆధారిత పంటల బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పంటల సాగుతో పాటు పాడి పశువుల పెంపకంపైనా దృష్టిసారించడం ద్వారా అదనపు ఆదాయాలను పొందవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగును ఉచితంగా చేపట్టవచ్చని.. అందువల్ల రైతులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రకృతి సేద్యం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు వందల మందికి వైద్య సేవలు

హైదరాబాద్, నవంబర్ 25: శ్రీ మాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ డి అరుణ్ కుమార్, ఎండీ, వందన హైస్కూల్ ప్రిన్సిపాల్ ఆడెపు విజయ శ్యామ్ ప్రారంభించారు. మంగళవారం శివనగర్ లోని వందన హైస్కూల్లో మెడికవర్ హాస్పిటల్, శరత్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో వందన హైస్కూల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 100 మంది విద్యార్థులు, 100 మంది డివిజన్ ప్రజలను పరీక్షించి ఉచితంగా డయాబెటిక్ టెస్ట్, బీపీ, నేత్ర పరీక్షలు, ఈసీజీ పరీక్ష నిర్వహించి మందులు అందచేశారని శ్రీమాతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపనేని సంజీవరావు తెలిపారు. వైద్య శిబిరంలో మెడికవర్ ఆసుపత్రి బృందం డాక్టర్ అరుణ్ కుమార్ క్యాంప్ కోఆర్డినేటర్ బంక సుమంత్ ఫార్మా డీ విద్యార్థులు మధుశా,ఉష రెడ్డి, ధరణి, శరత్ ఐ ఆస్పత్రి డాక్టర్ల బృందం పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీమాతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి కొత్తగట్టు కళ, కార్యదర్శి ఆకు బత్తిని రజని, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఆడెపు విజయ శ్యామ్, డివిజన్ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 2027 జనాభా గణనకు సిద్ధం..! మిమ్మల్ని అడిగే ప్రశ్నలు ఇవే..!

న్యూ ఢిల్లీ నవంబర్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొత్త ఏడాది 2027 జనాభా గణన ప్రారంభం కాబోతున్నది. ఎన్యుమరేటర్లు ఇండ్లకు చేరుకొని సమాచారం సేకరించారు. సర్వేయర్లంతా మీ ఇంటి నిర్మాణం నుంచి దాని ఉపయోగం వరకు ప్రతిదాని సమాచారం సేకరించనున్నదారు. ఉదాహరణకు సౌరశక్తి నుంచి ఇంటర్నెట్ వినియోగం వరకు ప్రతిదానిపై సమాచారాన్ని కోరనున్నారు. ఇంటి నేల, పైకప్పు, గోడలు దేనితో తయారు చేస్తారు? ఇల్లు నివాసంగా ఉపయోగి స్తున్నారా? కార్యాలయమా..? గెస్ట్‌హౌసా? ప్రార్థన స్థలం కూడా ఉందా?.. కాలువ, నది, బావి, చేతిపంపు, నల్లాల ద్వారా నీరు అందుతుందా? ప్యాకేజ్డ్, సీసాల్లో నీటిని ఉపయోగిస్తారా? అనే సమాచారాన్ని సేకరించనున్నారు. అలాగే, టెలిఫోన్లు, స్మార్ట్‌ఫోన్ల గురించిన సమాచారం కూడా సేకరించనున్నారు. దీని ఉద్దేశం కేవలం దేశ ప్రజల జీవన ప్రమాణాలు అర్థం చేసుకోవడమే. డేటా అభివృద్ధి చెందిన భారత ప్రచారంలో కొత్త విధానాలను రూపొందించడంలో, ఇప్పటికే ఉన్న విధానాల్లోని లోపాలను సరిదిద్దడంలో సహాయప డనున్నది. 2027 జనాభా లెక్కల మొదటి దశ కోసం గృహాల జాబితా, గృహాల గణన షెడ్యూల్ జాబితాను తయారు చేసే ప్రచారాన్ని కేంద్రం ముమ్మరం చేసింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరుగనుండగా.. ఇందు కోసం 30కిపైగా ప్రశ్నల జాబితా సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో జారీ చేయనున్నారు. ఇంటి యజమాని నుంచి ఇంట్లో ఉన్న కారు, మోటార్ సైకిల్, సైకిల్, మోపెడ్ గురించిన సమాచారం సేకరిస్తారు. ఇంట్లో వంట చేయడానికి ఏమి ఉపయోగి స్తున్నారు? కలప, పంట వ్యర్థాలు, పిడకలు, బొగ్గు, గోబర్ గ్యాస్, కిరసనాయిల్, ఎల్‌పీజీ, పీఎన్‌జీ, సోలార్ ఎనర్జీ ఇలా ఏం వాడు తున్నారో తెలుసుకొని రికార్డు చేయనున్నారు. టీవీ, ల్యాప్ టాప్, ల్యాండ్‌లైన్, మొబైల్ ఫోన్‌లలో డిష్, డీటీహెచ్ వినియోగిస్తున్నా ఆ సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే గోధుమ, జొన్న, బియ్యం, మిల్లెట్, మొక్కజొన్న వాడకం గురించి కూడా ప్రశ్నలు ఉంటాయి. 2027 జనాభా లెక్కల మొదటి దశ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో ఇళ్ల వివరాలు, అందులో నివసించే ప్రజల జీవన ప్రమా ణాలు ఎలా ఉన్నాయో తెలుసు కోనున్నారు. ప్రస్తుతం, లడఖ్, పశ్చిమ బెంగాల్ మినహా దేశవ్యాప్తంగా తొలిదశ సర్వే కోసం రిహార్సల్స్ జరుగు తున్నాయి. ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి డేటాను సేకరించి ఆన్‌లైన్ లో అప్‌డేట్ చేయనున్నారు. తొలిసారిగా డిజిటలైట్ చేస్తుండడం వల్ల జనాభా గణణ డేటా త్వరలోనే అందుబాటులోకి రానున్నది. గతంలో జనాభా గణన వివరాలు వేగంగా అందుబాటులోకి వచ్చినా.. వివరణాత్మక డేటా వచ్చేందుకు చాలా సంవత్సరాలు పట్టేది. రెండో దశలో 2027లో దేశవ్యాప్తంగా జనాభా గణన ఉంటుంది. ఇందులో కుల గణన కూడా ఉంటుంది. స్వాతంత్ర్యం తర్వాత జనాభా గణణలో మొబైల్ యాప్స్, పోర్టల్స్‌ను ఉపయోగిస్తా రు. ఇందుకు సంబంధించిన వివరాలు ఉంటాయి. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ ఆఫీస్ ఆఫ్ ఇండియా అన్ని రాష్ట్రాలకు వివరణాత్మక సూచనలను పంపింది.

# పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలి

మహబూబ్‌నగర్ నవంబర్ 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. దమ్ముంటే పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలని సవాల్ విసిరారు. నారాయణపేటలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలకు దిక్కు లేక కేంద్రం నిధుల కోసం కక్కు ర్తి పడుతున్నారని విమర్శిం చారు.కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం పంచా యతీ ఎన్నికలు వ నిర్వహి స్తోందని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే సర్పంచుల పదవీ కాలం పూర్తికాగానే ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన లో రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొన్నారు.ప్రభుత్వం చేతకానితనం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్లు పంచాయతీల నిధులు ఆగిపోయాయని వెల్లడించారు. ఆ నిధుల కోసమే కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తోందిని అన్నారు.

### గందరగోళంగా.. రిజర్వేషన్లు

ఎన్నికల కోసం కాంగ్రెస్ తీరు చూస్తే నవ్వొస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లు, 2024 సర్వే ప్రకారం వార్డ్ మెంబెర్స్ రిజర్వేషన్లు నిర్వహించడం విచారకరమని పేర్కొన్నారు. పార్టీ వరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అన్నారు . పార్టీ గుర్తులపై సర్పంచులు గెలవరు. అలాంటప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్స్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు.ఏ రకంగానైనా సర్పంచ్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలంటూ తాయిలాలు ప్రకటిస్తుందని విరుచుకు పడ్డారు. దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు ఇస్తున్నన్నారని ప్రశ్నించారు. పిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ కావాలా..? కాంగ్రెసోళ్ళు ఇచ్చే ముతక చీరలు కావాలో ఆలోచించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.కొడంగల్‌కు రోడ్లు వేసుకుంటే హైదరాబాద్ , సి కిం ద్రా బా ద్ లా మారిపోయినట్లేనా ? నని నిలదీశారు. జిల్లా వాసికి ముఖ్యమంత్రి అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజలకు ఒరిగింది ఏమిలేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చే నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

# రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలు..

### –ఇందిరమ్మ రాజ్యం, ఇంటింటా సౌభాగ్యం

అచ్చంపేట, నవంబర్ 25: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవానికి పెద్ద పీట వేసి మహిళా శక్తీకరణ దిశగా మరో కీలక అడుగు వేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఈ రోజు ఒక వీడియో సందేశంలో తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వాలు మహిళా భివృద్ధికి ఎవ్వరూ చేయని విధంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగానే 3 లక్షల 57 వేల 98 గ్రామీణ మహిళాన్వయం సహాయక సంఘాలకు 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ఈ రోజు వారి ఖాతాల్లోకి జమచేశారని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క, మంత్రి సీతక్కకు అచ్చంపేట నియోజ కవర్గ మహిళా స్వ యం సహా యక బృందాల తరఫున కృతజ్ఞ తలు తెలుపుకుంటున్నాని అన్నారు.

మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన కోసం తెలంగాణ ప్రభుత్వం నిజమైన సంక్షేమ దిశగా పనిచేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్రంలోని కోటి మందికి పైగా మహిళలకు అత్యంత నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలను అందించే కార్యక్రమం ప్రారంభమై గత మూడు రోజు లుగా నియోజక వర్గంలో పంపిణీ చేయబడుతున్న చీరల పంపిణీ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

స్వయం సహాయక బృందాలకు రుణాలు, చీరల పంపిణీ, మహిళా అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక శక్తీకరణకు ప్రాధాన్యతనిస్తోందని, గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహం, కుటుంబాభివృద్ధికి దోహదం చేసే విధంగా కార్యక్రమాలు అమలవుతున్నాయుని ఆయున తెలిపారు.

# జిల్లా అభివృద్ధిలో ఉద్యోగుల ప్రాత కీలకం

### –జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నవంబర్ 25: సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రజలకు పారదర్శకమైన సేవలందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణ రెడ్డి, సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డి.రమేష్ నగర అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావడంలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి సాంధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయ పారిశ్రామిక పర్యాటక సేవారంగాల్లో వార్షికవృద్ధి లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు మరింత కృషి చేయాలన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకమన్నారు. జిల్లాలో ఏడాదిగా సాధించిన విజయాలు అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో సాధ్యపడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని త్వరితగిన పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని భరోసా కల్పించారు.

# సామాన్య భక్తులకు అంతరాలయ దర్శనం

### –సుమారు 1500 మంది భక్తులకు అంతరాలయ దర్శనం
### –విజయవంతమైన ట్రయిల్ రన్
### –ఆనందం వ్యక్తం చేస్తున్న భక్తులు
### –బోర్డు ఆమోదం తరువాత కమిషనర్ పరిశీలనకు

ఎన్టీఆర్ నగర్, నవంబర్ 25:ఇప్పటివరకు వీఐపీలకు, రూ. 500 టికెట్ కొనుగోలు చేసిన వారికి మాత్రమే లభించిన అంతరాలయంలోని అమ్మవారి దివ్య దర్శన భాగ్యం ఇప్పుడు సామాన్య భక్తులకు కూడా అందుబాటులోకి రానుంది. సామాన్య భక్తులకు సైతం కనకదుర్గ అమ్మవారిని దగ్గర నుంచి చూసుకునే విధంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువైయున్న కనకదుర్గ అమ్మవారి దివ్యదర్శన భాగ్యాన్ని సామాన్య భక్తులకు దగ్గరగా అందించే క్రమంలో వారికి ఉచితంగా అంతరాలయ దర్శనాన్ని కల్పించారు. సామాన్య భక్తులకు అంతరాలు దర్శనం పేరిట ప్రయోగాత్మకంగా మంగళవారం అమలు చేసి చూశారు.

దేవస్థానం పాలకమండలి



చైర్మన్ బొర్రా గాంధీ ఈవో శీనా నాయక్ స్వయ పరివేక్షణలో మంగళవారం రాహుకాల సమయంలో గంటసేపు సామాన్య భక్తులకు అంతరాలయ భాగ్యాన్ని కల్పించారు. ఉచిత క్యూ లైన్ లో ద్వారా అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులను అంతరాలయ క్యూలైన్లోనికి కలిపి అమ్మవారి దర్శనాన్ని దగ్గర నుండి ఏర్పాటు చేశారు. సుమారు 1500 మంది భక్తులు మంగళవారం నిర్వహించిన ట్రయిల్ రన్ లో అంతరాలయ దర్శనం ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఇలా అంతరాలయ దర్శనం కల్పించే అంశంపై బోర్డు సర్వసభ్య సమావేశంలో చర్చించి తరువాత దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం అధికారులు ప్రతిపాదనలు పంపనన్నారు. సామాన్య భక్తులకు కూడా అమ్మవారి అంతరాలయ దర్శన భాగ్యాన్ని కల్పించడం పట్ల సామాన్య భక్తుల నుంచి ఆనందం, హర్షం వ్యక్తం అవుతుంది.

# తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు

ఆదిలాబాద్, నవంబర్ 25: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ ఎం బాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డి. యగ్దేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు సూర్య ప్రకాశ్ రెడ్డి, మణెమ్మ గోపాల్ రెడ్డి అన్నారు. ఈ రోజు నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా పథకం కింద సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడమంత్రి వాకిటి శ్రీహరి రైతుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంతో ఈ ప్రాంతానికి సాగునీరు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేస్తున్నారని అన్నారు.

రైతులను ఆదుకుంటున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని రుణమాఫీ పెట్టుబడి సహాయం అందజేస్తూ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తుందని అన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలు సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు 25 కిలోలవడ్లబస్త సబ్సిడీపైరూ 600కు పంపిణీ పంపిణీ చేస్తుందన్నారు. ఊట్కూర్ పెద్ద చెరువుకు సాగునీరు అందిస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందనిఅన్నారు.

రైతులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో గణేష్ రెడ్డి(యా ఉజీనివబష్త్ర ఖీవటటఎ), ఏ ఈ ఓ స్వరూపారాణి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎల్కోటి జనార్దన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



విజయవాడ,నవంబర్ 25:: సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ప్రజలకు పారదర్శకమైన సేవలందించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.సత్య నారాయణ రెడ్డి, సహాధ్యక్షుడు వేమూరి ప్రసాద్, కార్యదర్శి డి.రమేష్ నగర అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విజయవంతం కావడంలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయ పారిశ్రామిక పర్యాటక సేవారంగాల్లో వార్షికవృద్ధి లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు మరింత కృషిచేయాలన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఉద్యోగుల భాగస్వామ్యం కీలకమన్నారు. జిల్లాలో ఏడాదిగా సాధించిన విజయాలు అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో సాధ్యపడిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటిని త్వరితగిన పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటానని భరోసా కల్పించారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డివిఎన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తూ ప్రజల కలెక్టర్‌గా పేరు తెచ్చుకోవడం ఉద్యోగులకు గర్వకారణం అన్నారు. ఏ పి ఎన్జిజిఒ రాష్ట అధ్యక్షుడు విద్యాసాగర్ నేతృత్వంలో ఉద్యోగులు పారదర్శకత, నిబద్ధతతో సేవలందిస్తూ జిల్లా యంత్రాంగం అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తించేందుకు ఉద్యోగులూ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్‌ను ( ఆ తి బ బి తీ తి ఇ బి అనీశ్రీశ్రీవఇబినీతీ) కలిసిన వారిలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు వీ.వీ. ప్రసాద్, పి.రమేష్, బి.సతీష్ కుమార్, ఎం.రాజుబాబు, డి.విశ్వనాథ్, బీవీ రమణ, రామకృష్ణ, మహిళా ప్రతినిధి కె.శివలీల, నగర కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్ కే నజీరుద్దీన్, వి.రాజశేఖర్, దిలీప్ కుమార్, కె.మధుసూదనరావు, శ్రీనివాసరావు, విజయశ్రీ, సాగర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 25:సంపూర్ణ ఆరోగ్యంతో పాటు దీర్ఘకాలిక పురోగతికి కీలకం సాంప్రదాయక వైద్యమేనన్న భావనను ప్రోత్సహించే విషయంలో భారత్ అత్యంత నిబద్ధతతో ముందుకు పోతోందని వివరించిన కేంద్ర మంత్రి శ్రీ ప్రతాప్‌రావు జాదవ్ వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రజలతో పంచుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని పీఎంఓ ఇండియా పొందుపరుస్తూ "సాంప్రదాయక వైద్య వారసత్వాన్ని గొప్పగా చాటిచెప్పడంతో పాటు ఆ వైద్యానికి రాబోయే కాలంలోనూ మరింత ఆదరణ లభించేటట్లు చూడటానికి భారత్ వివిధ కార్యక్రమాలను అమలుచేస్తోందని కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావు జాదవ్

ఒక వ్యాసంలో వివరించారు. ఇది తప్పక చదవాల్సిన వ్యాసం.

ఆరోగ్యం బాగుచేయాలి, అంతేకాని హానిని కలగజేయకూడదు.. పురోగతి నిరంతరంగా వెలుగులీనుతుండాలే తప్ప, కొడిగట్టిపోరాదు.. సైన్సు సేవను అందించాలి గానీ, అడ్డుగోడలను నిర్మించవద్దన్నదే భారత్ ఇస్తున్న ముఖ్య సందేశమని ఆయన ప్రధానంగా వివరించారు" అని పేర్కొంది.

# జ్యోతిసర్‌లో మహాభారత్ అనుభవ కేంద్రాన్ని సందర్శించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 25:భగవాన్ కృష్ణుని పవిత్ర శంఖాన్ని గౌరవించుకోవడానికి కొత్తగా నిర్మించిన 'పాంచజన్య'ను ప్రధానమంత్రి సాయంత్రం సుమారు 4 గంటలకు ప్రారంభిస్తారు. మహాభారత్ అనుభవ కేంద్రాన్ని ఆయన సందర్శిస్తారు. ఇదొక ఆకర్షణీయ అనుభవ కేంద్రం. దీన్లో మహాభారతానికి చెందిన విశేష ఘట్టాల్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తున్నారు. అంతేకాక, వీటి ద్వారా మహాభారత శాశ్వత సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని కూడా వివరిస్తున్నారు.

సిక్కుల ఆరాధ్య గురువు శ్రీ గురు తేగ్ బహాదుర్ జీ 350వ అమరత్వ దినోత్సవానికి గుర్తుగా ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సాయంత్రం దాదాపుగా 4:30కి ప్రధానమంత్రి పాలుపంచుకోనున్నారు. ఇదే కార్యక్రమంలో, గురు తేగ్ బహాదుర్ 350వ అమరత్వ దినోత్సవ స్మారక స్టాంపుతో పాటు ఒక ప్రత్యేక నాణేన్ని కూడా ప్రధానమంత్రి విడుదల చేస్తారు. జనసభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. గురు తేగ్ బహాదుర్ 350వ అమరత్వ దినోత్సవాన్ని గౌరవించుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒక సంవత్సరం పాటు స్మరణోత్సవాన్ని నిర్వహిస్తోంది.

సాయంత్రం 5:45 గంటలకు ప్రధానమంత్రి బ్రహ్మ సరోవరానికి చేరుకొని దర్శన, పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు. భారత్‌లో అన్నిటి కన్నా పవిత్రమైన తీర్థ స్థలాల్లో బ్రహ్మ సరోవరం కూడా ఒకటి. ఇది శ్రీమద్భగవద్గీతలోని దివ్య జ్ఞాన బోధతో ముడిపడిన స్థలమని చెబుతుంటారు. ఈ నెల 15 మొదలు వచ్చే నెల 5వ తేదీ వరకు కురుక్షేత్రంలో అంతర్జాతీయ గీత మహోత్సవాన్ని నిర్వహిస్తుండగా, ఈ కాలంలోనే ఈ పర్యటన చోటుచేసుకొంటుండటం యాదృచ్ఛికం.

# మిజోరంలో విదేశీ సిగరెట్ల దొంగరవాణా... రూ.14.74 కోట్ల సిగరెట్లను జప్తుచేసిన డీఆర్ఐ...ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ, నవంబర్ 25:ఈశాన్య ప్రాంతంలో విదేశీ సిగరెట్ల దొంగరవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా రెవిన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) "ఆపరేషన్ ఫిల్టర్ అవుట్" అనే సంకేత నామంతో మిజోరంలో ఈ నెల 21, 22 తేదీల్లో సవన్వయంవ్రాం వ్క కాం ్య క్ లా ఎాలనం నిర్వహించింది. దీన్లో అస్సాం రైఫిల్స్‌తో పాటు సరిహద్దు భద్రతాదళం కూడా సహాయాన్ని అందించాయి.

ఒకటో కేసులో, ఈ నెల 21న మిజోరంలోని మమిత్ జిల్లా కన్వ్మున్‌లో అనుమానాస్పద వాహనాన్ని ఆపారు. ఆ వాహనంలో నుంచి 165 కార్టన్లలో 16 లక్షల యాభై వేల విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఓరిస్, విన్, బెన్సన్ అండ్ హెడ్జెస్ బ్రాండ్లకు చెందిన సిగరెట్లు ఉన్నాయి. కన్వ్మున్‌లోనే ఒక గోదామును సోదా చేసి 110 కార్టన్ల ఓరిస్, బెన్సన్ అండ్ హెడ్జెస్ బ్లూ గోల్డ్ బ్రాండ్లకు చెందిన 11 లక్షల సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. తరువాత కన్వ్మున్‌లోని మరో గోదాము నుంచి 87 కార్టన్ల (8 లక్షల డెబ్భయ్ వేల సిగరెట్ల)ను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ప్యారిస్ స్పెషల్ ఫిల్టర్, ఎక్స్‌ఎస్ఓ బ్లాక్ ఫ్రూట్స్, బెన్సన్ అండ్ హెడ్జెస్ బ్లూ గోల్డ్ బ్రాండ్లకు చెందిన సిగరెట్లు ఉన్నాయి. ఈ కేసులో మొత్తం 36 లక్షల ఇరవై వేల విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్టు చేశారు.

రెండో కేసులో ఈ నెల 22న మిజోరంలోని లుంగ్‌లేయిలో గల చండ్‌మారీ ప్రాంతంలో రెండు గోదాములతో పాటు ఒక నివాస స్థలంలో సోదాలు చేశారు. 375 కార్టన్లను (వీటిలో 37 లక్షల యాభై వేల విదేశీ సిగరెట్లు ఉన్నాయి) స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగరెట్లలో ఓరిస్, విన్, వీ, ఫార్ స్టార్, ఎస్సే లైట్, ప్యాట్రన్, మోండ్ అండ్ వేలియంట్ బ్రాండ్లవి ఉన్నాయి. ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.

ఈ కార్యకలాపాల్లో మొత్తం 73 లక్షల 70 వేల విదేశీ సిగరెట్లను జప్తు చేశారు. మార్కెట్లో వాటి విలువ రూ.14.74 కోట్లు. జప్తు చేసిన సిగరెట్ ప్యాకెట్లపై సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు (ప్రకటనల నిషేధంతో పాటు ఉత్పత్తి, వాణిజ్యం, సరఫరా, పంపిణీల నియంత్రణ) చట్టం-2003లో భాగంగా బొమ్మలతో ఆరోగ్య సంబంధ హెచ్చరికలేవీ ప్రచురించలేదన్న సంగతిని గమనించారు.

ఈ విదేశీ సిగరెట్లను భారత్-మయన్మార్ సరిహద్దులోని జోక్‌హాథర్ సెక్టర్ గుండా దొంగతనంగా రవాణా చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న సిగరెట్లనూ, వాహనాన్నీ కస్టమ్స్ చట్టం-1962లో భాగంగా జప్తు చేశారు. ముగ్గురిని అరెస్టు చేశారు.

# ఎప్పటికీ వయస్సు పెరగని బాలుడి కళ్ళ ద్వారా జాతి ఆత్మను ప్రతిబింబించిన 'సాంగ్స్ ఆఫ్ ఆడమ్'

న్యూఢిల్లీ, నవంబర్ 25: 'సాంగ్స్ ఆఫ్ ఆడమ్'... 'స్కిన్ ఆఫ్ యూత్'... 'కే పాపర్' చిత్రాల తారాగణం, సిబ్బంది తమ చిత్రాలను రూపొందించడానికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తిగత, సామాజిక, సాంస్కృతిక ప్రేరణల గురించి తమ అనుభవాలను పంచుకున్నారు. కథ చెప్పడంలోని ప్రతిభను, చిత్రరూపకల్పనలోని సవాళ్లను, తెరపై ప్రాతినిధ్యం వహించే శక్తిమంతమైన గళాలను వారి విలేకరుల సమావేశం హైలైట్ చేసింది.

"సాంగ్స్ ఆఫ్ ఆడమ్": ఒక మాయాజాల-వాస్తవిక జ్ఞాపకాల గీతం, పరివర్తన చెందుతున్న దేశం

సాంగ్స్ ఆఫ్ ఆడమ్ చిత్ర లోతైన సన్నిహిత మూలాలను సహ నిర్మాత అసమా రషీద్ పంచుకున్నారు. ఇది దర్శకుడి బాల్యంలో ఎదురైన నష్టాల నేపథ్యంతో మొదలై... సంవత్సరాల తరబడి సాగిన ప్రాజెక్ట్ అని తెలిపారు.

వేం ఈ సినిమా కోసం మూడు సంవత్సరాలకు పైగా పనిచేశాం. ఈ సినిమా దర్శకుడికి చాలా వ్యక్తిగతమైనది - అతను తన తాత మరణం తర్వాత 12 సంవత్సరాల వయస్సులో కలిగిన ఆలోచనలతో దీన్ని రూపొందించాడు," అని ఆయన తెలిపారు. మెసొపొటేమియా కథలకు మంచి వనరులను అందిస్తుందన్నారు. అక్కడి బాలుడికి కథకు మించి ఏమి జరుగుతుందో ఆయన వివరించారు. "ఈ కథనం ఇరాక్ అనుభవించిన సామాజిక పరివర్తనలను ప్రతిబింబిస్తుంది" అని అసనా వ్యాఖ్యానించారు.

అతని మాటలు సినిమాలోని భావోద్వేగాల లోతును ప్రతిబింబిస్తాయి. ఇందులో శాశ్వతత్వం, పురాణం, జాతీయ చరిత్ర ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

సాంగ్స్ ఆఫ్ ఆడమ్ కథ 1946 మెసొపొటేమియా నేపథ్యంలో సాగుతుంది. 12 ఏళ్ల ఆడమ్ జీవితం చుట్టూ కథ తిరుగుతుంది. అతను తన తాత సమాధిని చూసిన తర్వాత తాను ఎప్పటికీ పెరగనని ప్రతిజ్ఞ చేస్తాడు. విచిత్రంగా అందరూ వృద్ధాప్యంలోకి వచ్చినా అతను పిల్లవాడిగానే ఉండిపోతాడు. అతని తండ్రి శాపానికి భయపడి అతన్ని ఒంటరిని చేస్తాడు. అతని చుట్టూ ఉన్నవారు అతని శాశ్వత ఉనికిని గుర్తిస్తారు. 1950ల తిరుగుబాట్ల నుంచి సమకాలీన యుద్ధాల వరకు ఇరాక్ రాజకీయ తిరుగుబాట్లకు గురవుతున్నప్పుడు ఆడమ్ ఒక ఆధ్యాత్మిక గురువు అవుతాడు. మాయా-వాస్తవికతల ద్వారా ఈ చిత్రం అతని శాశ్వతమైన యువ్వనాన్ని ఒక దేశంతో పోలుస్తూ అన్వేషిస్తుంది. ఇది అతని జ్ఞాపకశక్తి, నష్టం, నిరంతర మార్పుల మధ్య స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాల హృదయ విదారకమైన రూపకం.

# గురు తేగ్ బహాదుర్ జీ త్యాగం, సాహసం, ప్రాణత్యాగాలతో నిండిన గాథ మనకు సదా స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ, నవంబర్ 25:గురు తేగ్ బహాదుర్ జీ అమరత్వాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా స్మరించుకుంటూ ఈ రోజు ఢిల్లీలో శ్రద్ధాంజలి ఘటించారు. గురు తేగ్ బహాదుర్ జీకి నమస్సులర్పించడంతో పాటు, నేలకు శిరసును తాకించి ప్రణామం చేశారు శ్రీ షా.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఒక సందేశాన్ని పొందుపరుస్తూ "అన్యాయాన్నీ, అధర్మాన్నీ గురు తేగ్ బహాదుర్ జీ ధైర్య, శౌర్యాలతో ఎదురొడ్డి నిలిచిన విధం భారత్‌లో ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని అందిస్తోంది. ధర్మ రక్షణ కోసం ఆయన తన ప్రాణాలను ఆహుతి చేయడానికైనా వెనుదీయలేదు. ఆయన జీవనం భారత ఆధ్యాత్మిక చేతన, సాహసం, ప్రాణత్యాగాల శాశ్వత గాథగా నిలిచి ఉంటుంద"న్నారు.

ధర్మానికీ, సంస్కృతికీ గురు సాహిబ్ తన జీవితాన్ని అంకితం చేసిన తీరును దేశమంతా స్మరించుకుంటూ, ఆయన 350వ అమరత్వ దినాన్ని కృతజ్ఞతపూర్వకంగా పాటిస్తుందని ప్రధానమంత్రి శ్రీ మోదీ జీ నిర్ణయించారని శ్రీ షా తెలిపారు. గురు తేగ్ బహాదుర్ జీ ప్రాణత్యాగాన్ని స్మరించుకుంటూ ఈ రోజు ఢిల్లీలో నేను నమస్సులు అర్పించి, శిరసా ప్రణామం చేశాను. గురు తేగ్ బహాదుర్ జీ త్యాగం, సాహసం, ప్రాణత్యాగం .. వీటికి సంబంధించిన గాథలు మనకు ఎల్లప్పటికీ స్ఫూర్తిని అందిస్తూ ఉంటాయని శ్రీ షా పేర్కొన్నారు.

# సినిమా కూర్పుపై అవగాహన: కథాగమనంలో లయను వివరించిన శ్రీకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, నవంబర్ 25: భారత 56వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం-2025 (ఇఫి)లో 5వ రోజున సినిమా కూర్పు (ఎడిటింగ్)పై "ఫ్రమ్ మైండ్ టు స్క్రీన్: విజన్ టు ఎగ్జిక్యూషన్" (ఆలోచనలకు తెరరూపం - దృక్కోణం నుంచి దృశ్యీకరణ) పేరిట నిర్వహించిన కార్యగోష్ఠి (వర్క్ షాప్)ని ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ నడిపించారు. సినిమా వెనుక ఎక్కడా కనిపించని, వినిపించని నిర్ణయాత్మక కళపై అవగాహన కల్పించే ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ 'ఎడిటింగ్ టేబుల్' (సినిమా కూర్పు కార్యస్థానం)పైనే దృశ్యాలన్నీ ఎంతో సమతౌల్యంతో సన్నివేశాలుగా అమరి, ఒక పరిపూర్ణ సినిమా రూపుదిద్దుకుంటుంది. శ్రీకర్ ప్రసాద్ తన సుదీర్ఘ సినిమా రంగ పయనంలో ఇప్పటిదాకా 18 భాషలలో 650 చిత్రాలకు ఎడిటర్‌గా పనిచేశారు. అసంఖ్యాక ఎడిటింగ్ గదులలో.. రకరకాల సంస్కృతుల సంబంధిత కథల కూర్పులో గడించిన అపార అనుభవాన్ని ఆయన ప్రేక్షకులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి సైకత్ ఎస్.రే సంధానకర్తగా వ్యవహరించారు. ఒక కథకు తొలి దృశ్యం నుంచి సినిమా దాకా తుది రూపం ఇచ్చే ప్రక్రియపై ఇది ప్రాథమిక అవగాహన కల్పించింది.

గోష్ఠి ప్రారంభానికి ముందే శ్రీకర్ ప్రసాద్‌ను ప్రముఖ చలనచిత్ర నిర్మాత రవి కొట్టార్కర సత్కరించారు. ఎడిటింగ్ కళలో ఆయనకున్న విస్తృత అనుభవాన్ని, "ఏమి చేయకూడదో" చక్కగా తెలిసిన విశిష్ట సామర్థ్యాన్ని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇది ఒక సినిమా ఎడిటర్ నిజమైన ప్రతిభను వెల్లడించే ప్రత్యేక లక్షణమని ఆయన అభివర్ణించారు.

ఎడిటింగ్ కళ ఓ సాంకేతిక ప్రక్రియ మాత్రమేననే భావనను సవాలు చేస్తూ ప్రసంగం ప్రారంభించిన శ్రీకర్ ప్రసాద్, ఈ రంగంలో తన 40 ఏళ్ల అనుభవాలను ఆసక్తికరంగా వివరించారు. సినిమా కూర్పు భావోద్వేగంలో అంతర్భాగమని, ప్రతి కత్తిరింపు (కట్) ప్రేక్షకుల మనోభావాన్ని నడిపించేదిగా ఉండాలని ఆయన చెప్పారు. భారీ పరిమాణంలో చిత్రించిన దృశ్యాలను ముందేసుకుని పని ప్రారంభించే ఒక ఎడిటర్, వాటన్నిటినీ అర్థవంతంగా, స్పష్టతతో కథ వెంట నడిపించడమే అతనికి నిజమైన పరీక్ష అని... అంతిమంగా సినిమా మొత్తాన్నీ మోసేది ఆ కథేనని స్పష్టం చేశారు.

ఒక ఎడిటర్ స్క్రిప్ట్ స్థాయిలోనే తన పని మొదలు పెట్టడం మంచిదని, చిత్ర నిర్మాణ ప్రక్రియ అంతటా ప్రమేయం ఉండటం ద్వారా సత్ఫలితం రాబట్టవచ్చునని ఆయన చెప్పారు. తొలినాళ్లలో ఎడిటింగ్ కళ తనకు యాంత్రికంగా అనిపించినప్పటికీ, వేర్వేరు దర్శకులతో పనిచేయడం వల్ల తనలోని కొత్త దృక్కోణాన్ని ఆవిష్కరించుకునే అవకాశం లభించిందని తెలిపారు. కంటెంట్, సృజనాత్మకత పరంగా రేపన్నది ఈ రోజులా ఎప్పుడూ ఉండదన్నారు. ఈ స్థిరమైన మార్పు కాలక్రమంలో- కథాగమనాన్ని ఎక్కడ ఆపాలో... ఎక్కడ తిరిగి ప్రారంభించాలో, కథలో ఉత్కంఠను ఎలా కొనసాగించాలో తెలిసిన దర్శకుడిలా ఎడిటర్‌ను రూపుదిద్దుతుందని చెప్పారు.

గోష్ఠి సాగుతుండగా ఒక ఆసక్తికర సందర్భంలో- "ఎడిటింగ్ టేబుల్ మీదనే సినిమా తయారవుతుంది" అనే విస్తృత భావన గురించి ఆయన ప్రస్తావించారు. వేర్వేరు దృశ్యాలను సన్నివేశాలుగా పెనవేసి, కథనాన్ని నడిపిస్తూ, అంతిమంగా పూర్తి నిడివి కథకు రూపమివ్వడం దాకా ఒక చిత్రం కూర్పులోని దశల క్రమాన్ని సోదాహరణంగా వివరించారు. ఈ మేరకు 1998నాటి 'ది టెర్రరిస్ట్' చిత్రంలోని దృశ్యాలను చూపుతూ, కథను నడిపించడంలో నిశ్శబ్దమే ఒక ఉపకరణంగా మారిన తీరును ఆయన ప్రదర్శించారు. అనంతర కాలంలో 'వానప్రస్థం' వంటి చిత్రాల నిర్మాణానికి ఈ ఆవిష్కరణ దోహదం చేసిందని పేర్కొన్నారు. ప్రేక్షకులు పసిగట్టలేని రీతిలో కత్తిరింపులు, అతులకుతో ప్రతి సన్నివేశాన్ని ఒక స్రవంతిలా మలచాలని ఆయన వివరించారు.

భావోద్వేగ సమతౌల్యం ప్రాధాన్యాన్ని వివరిస్తూ- సమాంతర కథనాలు, బహుళ పాత్రల అంతర కథనాల వంటివి ప్రధాన కథ నుంచి ప్రేక్షకుల దృష్టిని మళ్లించకుండా జాగ్రత్త వహించాలని గుర్తుచేశారు.

చిత్రంలో ఒక పాత్ర ఉత్తమ స్వభావాన్ని చేయడం కన్నా అందులోని అంతర్లీన చెడు స్వభావాన్ని కప్పిపుచ్చడంలో ఎడిటర్ తరచూ తన ప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. మరింత విశదంగా చెప్పాలంటే- ఒక పాత్ర సత్ప్రవర్తన నుంచి పక్కకు మళ్లినపుడు లేదా దాని స్థాయిని మించిపోయే సందర్భంలో కూర్పులో దాన్ని సున్నితంగా సరిదిద్ది, పాత్ర సమగ్రతను కొనసాగిస్తూ సన్నివేశాన్ని బిగువుగా ఉంచాలని ఆయన అన్నారు.

అనంతరం సంధానకర్త సైకత్- ఆధునిక సాంకేతికతలను స్పృశిస్తూ సంభాషణను కృత్రిమ మేధ వైపు నడిపించారు. ఈ సందర్భంగా అలాంటి వ్యవస్థ తొలుత ప్రయత్నించేది శ్రీకర్ ప్రసాద్ శైలిని అనుకరించడమేనని ఆయన చమత్కరించారు. దీనిపై ప్రేక్షకుల నవ్వుతో గది ప్రతిధ్వనించగా, శ్రీకర్ చిరుమందహాసంతో ఆ వ్యాఖ్యపై స్పందిస్తూ- ఈ ప్రక్రియలోని యాంత్రిక అంశాలను కృత్రిమ మేధ కచ్చితంగా గ్రహించగలదన్నారు. కానీ, భావోద్వేగం, లయ వంటి అనుభూతి దానికి ఉండదని, సహజ ధోరణితో కత్తిరింపును సూచించజాలదని ఆయన స్పష్టం చేశారు. ఎడిటింగ్ అనేది తన దృష్టిలో సహజ జ్ఞానంతో కూడిన దృక్కోణంగల కళ మాత్రమేనని, ఏ యంత్రమూ ఆ జ్ఞానాన్ని మించిపోలేదని చెప్పారు.

ఓర్పు, సన్నివేశం ముగింపును రూపొందించే బాధ్యత విమర్శలపై నిష్పాక్షపాత్యం వంటి అంశాలపై అభిప్రాయాల ఆదానప్రదానంతో కార్యగోష్ఠి ముగిసింది. సినిమాను ఒక సామాజిక వ్యాఖ్యానం, వ్యక్తీకరణ, అడుగుజాడగా పాదముద్రగా శ్రీకర్ ప్రసాద్ అభివర్ణించారు. చివరగా- కథ చెప్పడం అనేది సృజనాత్మకతకు పరిమితం కాదని, అదొక సామాజిక బాధ్యతని చెబుతూ

# కార్మికుల బీమా పెంపుపై రెండోరోజు అవగాహన సదస్సు...



ఖమ్మం, నవంబర్ 25 (నేటినిజం ప్రతినిధి) :కార్మికుల భీమా పెంపు అవగాహన సదస్సు రెండవ రోజులో భాగంగా మంగళవారం నాడు బల్లెపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాల ప్రాంగణం లోకి వెళ్లి అక్కడ పని చేస్తున్న దాదాపు 150మంది భవన నిర్మాణ కార్మికులను కలిసి బీమా పెంపు పై అవగాహన, అర్హులైన ప్రతి ఒక్కరికి భవన నిర్మాణ కార్మిక కార్డులను ఎలా పొందాలి, పొందిన వారు ఎలా గడువు పూర్తయిన తర్వాత ఎలా రెన్యువల్ చేసుకోవాలి, చేసుకున్న అర్హులకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయని జిల్లా అధికారి ఉప కార్మిక కమిషనర్ కె.విజయభాస్కర్ రెడ్డి, సహాయ కార్మిక శాఖ అధికారి వెంగమాంబ, ట్రయిల్ బ్లేజర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఖమ్మం జిల్లా బాధ్యులు పి.రమేష్ ఈ కార్యక్రమంలో వలస భవన నిర్మాణ కార్మికులకు తెలియపరిచారు.

# 'కల్లుగీత కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేయాలి'

నల్గొండ, నవంబర్ 25:ఈ నెల 28న సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం కట్టంగూర్ మండల గౌరవ అధ్యక్షుడు చౌగోని లింగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో మహాసభల పోస్టర్ ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. కార్మికులకు రూ.4 వేల పింఛన్‌తో పాటు ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఉపాధి కోసం ప్రతి గ్రామంలో ఈత చెట్ల పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు.

# పాము కాటుకు వ్యక్తి మృతి

ఆదిలాబాద్, నవంబర్ 25:: పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని ఎడవెల్లి గ్రామంలో చోటుచే సుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన సాయిలు(36) అనే వ్యక్తి ఈనెల 19న వ్యవసాయ పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత అందరూ కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు.

మరుసటి రోజు ఉదయం 6 గంటల ప్రాంతంలో భర్త మేల్కొనక పోవడంతో చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా పాము కాటు వేసినట్లు వైద్యులు గుర్తించారు.

వైద్య చికిత్సలు చేస్తుండగా ఈనెల 24న చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# లింగ భేదం సరిహద్దులను చెరిపేసిన 'లాలా అండ్ పాపీ' చిత్ర విశేషాలను పంచుకున్న చిత్ర బృందం

న్యూఢిల్లీ, నవంబర్ 25:ముంబయి నగరంలో తీసిన సున్నితమైన, లింగ వైవిధ్య ప్రేమకథ అయిన 'లాలా అండ్ పాపీ' చిత్ర బృందం ఈ రోజు ఐఎఫ్ఎఫ్ఐలో ఒక పత్రికా సమావేశాన్ని నిర్వహించింది. ఈ చిత్ర ప్రయాణం, దాని సామాజిక నేపథ్యం, వాస్తవ పరిస్థితులను యథాతథంగా చిత్రీకరించటం గురించి వారు మాట్లాడారు. పేర్ల కంటే ప్రేమను, లింగ ద్వంద్వత్వం కంటే మానవత్వాన్ని, ప్రదర్శన కంటే ప్రామాణికతను కేంద్రంగా చేసిన ఈ సినిమా గురించి దర్శకుడు కైజాద్ గుస్తాద్, నిర్మాత బాబీ బేడీ, నటులు వీర్ సింగ్–సూరజ్ రాజ్‌ఖోవా చర్చించారు.

దశాబ్దాల పాటు ప్రధాన స్రవంతి చిత్రాలను నిర్మించిన తరువాత ఈ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇచ్చే విషయాన్ని నిర్మాత నిర్మాత బాబీ బేడీ పంచుకున్నారు. దీనితోనే కార్యక్రమం ప్రారంభమైంది. "ప్రేక్షకులు స్వీకరించడం వల్లనే ప్రతి పెద్ద సినిమా పెద్దది అవుతుంది" అని ఆయన అన్నారు. 'లాలా అండ్ పాపీ' కూడా అదే దిశలో పయణిస్తోంది. ఈ సినిమా కథలో నిజాయితీ, మన అనే భావన ఉన్నాయని ప్రధానంగా చెప్పారు. ఈ చిత్రం గత సంవత్సరం గోవాలోని ఐఎఫ్ఎఫ్ఐలో ఫైనల్లో ఎంపికైందని తెలియజేసిన ఆయన.. చట్టం ఇప్పుడు పలు రకాల లింగాలను గుర్తిస్తున్నప్పటికీ సాధారణ సామాజిక అంగీకారం ఇప్పటికీ లేదంటూ దేశంలో మారుతోన్న సామాజిక పరిస్థితులను ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రం "మానవులు ముందు, ఆడ మగ అనేవి తరువాత" అనే సామాన్య నమ్మకంతో సినిమా ప్రారంభమౌతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఉండటానికి, ప్రేమించేందుకు, భయం లేకుండా జీవించడానికి అర్హత కలిగి ఉండాలని ఆయన ప్రధానంగా పేర్కొన్నారు.

దీనికి కొనసాగింపుగా దర్శకుడు కైజాద్ గుస్తాద్ మాట్లాడారు. నిజాయితీ గల, మొత్తం ప్రపంచ స్వరాన్ని వినిపించే ఒక చిత్రాన్ని రూపొందించేందుకు తాను బయలుదేరినట్లు తెలిపారు. "ఒక క్వీర్ ప్రేమ కథను" తీయటం కంటే రెండు ట్రాన్స్‌జెండర్ ప్రధాన పాత్రల మధ్య ఆవిష్కృతమయ్యే ఒక సాధారణ శృంగార కథను చెప్పాలనుకున్నట్లు తెలియజేశారు. తనకు తక్కువ తెలిసిన అంశం గురించి రాస్తున్నందున సంవత్సరాల పరిశోధన, క్వీర్ కమ్యూనిటీతో సన్నిహిత అనుబంధం, సూక్ష్మ నైపుణ్యాలను సరిగ్గా పొందాలనే నిబద్ధత అవసరమయ్యాయని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన రచన ప్రక్రియ గురించి ఆయన మాట్లాడారు.

సినిమాలో ట్రాన్స్‌జెండర్ పాత్ర పోషించిన వీర్ సింగ్, సూరజ్ రాజ్‌ఖోవా అనే ఇద్దరు వ్యక్తులు ఈ సంభాషణను వ్యక్తిగతమైన సన్నిహితమైన అంశంగా మలిచారు. తాను పెరుగుతున్నప్పుడు తమలాంటి వ్యక్తులు తెరపై లేకపోవడం గమనించినట్లు వీర్ పేర్కొన్నారు. మూడో లింగంగా పరిగణించే వారికి ప్రాతినిధ్యం ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. "నాలాంటి వారు నన్ను తెరపై చూసి ఈ వ్యక్తి చేయగలిగితే నేను కూడా చేయగలను అని అనుకోవాలి" అని వీర్ అన్నారు. భారతీయ సినిమాలో క్వీర్ పాత్రలు చాలా కాలంగా ఉన్నప్పటికీ.. అవి తరచుగా కార్టూన్‌లుగా లేదా హాస్య పాత్రలుగా మాత్రమే ఉన్నాయని సూరజ్ అన్నారు. 'లాలా అండ్ పాపీ' సినిమా ద్వారా ఒక సాధారణ మానవుడిగా తెరపై కనిపించే అవకాశం లభించిందని.. "ప్రత్యేకించి ఇదే ఒక అద్భుతంగా అనిపిస్తుంది" అని సూరజ్ పేర్కొన్నారు.

ఈ చిత్రం క్వీర్ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుందా లేక ప్రధాన స్రవంతి ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుందా అని అడిగినప్పుడు.. "ఇది ప్రజల కోసం రూపొందించిన చిత్రం ఉత్సవాల కోసం కాదు" అని బాబీ బేడీ స్పష్టం చేశారు. ఈ చిత్రం ప్రధానంగా సామాన్య ప్రజలకు చెందినది కాబట్టి దీనిని ప్రధాన స్రవంతి కార్యక్రమాలు, సినిమా హాళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు తీసుకువెళ్లడం గురించి ఆయన మాట్లాడారు.

'లాలా అండ్ పాపీ' అనేది ఒక "సందేశాత్మక చిత్రం" కాదని కైజాద్ పునరుద్ఘాటించారు. నైతికతను చెప్పటానికి బదులుగా భావోద్వేగపరమైన వాస్తవంగా చెప్పే విధంగా ఇది ఉండాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. "ఒక కథ ప్రేక్షకులను ఆకర్షించాలి. ప్రేమ లింగ భేదాన్ని అధిగమిస్తుంది. ఆ సందేశాన్ని అరిచి చెప్పాల్సిన అవసరం లేదు. దీనిని అది అనుభూతి చెందాలి" అని వ్యాఖ్యానించారు.

ఈ ఇద్దరు నటులకు గుర్తింపు, గౌరవం ఇచ్చే ఈ చిత్రం.. ట్రాన్స్ వ్యక్తులు కేవలం వ్యక్తులుగా కనిపించే సినిమాటిక్ ప్రపంచం ప్రారంభం విషయంలో ఒక ఆశగా నిలుస్తుంది. "ఇది చారిత్రక ఘట్టంగా అనిపిస్తోంది" అని సూరజ్ అన్నారు.

'లాలా ఑ పాపీ' కేవలం లింగ పరివర్తన సంబంధించిన చిత్రం మాత్రమే కాదు. ఇది ప్రేమ, ధైర్యం, ఉనికికి సంబంధించిన హక్కులను తెలిపే చిత్రం. మారుతూ ఉండే లింగ గుర్తింపును అంగీకరించాన్ని ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్న ప్రపంచంలో అన్ని రూపాల్లో ప్రేమ వికసించేందుకు అవకాశం ఉండాలని తెలియజేసే ఈ చిత్రం ఒక మంచి గుర్తుగా నిలుస్తుంది.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) దక్షిణాసియాలో అత్యంత ఎక్కువ చరిత్ర కలిగిన అతిపెద్ద సినిమా వేడుకగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వంలోని సమాచార– ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ చలన చిత్ర అభివృద్ధి సంస్థ (నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్–ఎన్ఎఫ్‌డీసీ), గోవా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ ఆఫ్ గోవా (ఈఎస్‌జీ) సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. పునరుద్ధరించబడిన క్లాసిక్ సినిమాలు సాహసోపేతమైన ప్రయోగాత్మక చిత్రాలు ఒక వేదికపై నిలుస్తాయి. ప్రసిద్ధ దర్శక నిర్మాతలు, నిర్భయులైన తొలి దర్శకులతో వేదికను పంచుకుంటారు. ఇలా ఒక ప్రపంచ సినిమా కేంద్రంగా ఈ ఉత్సవం ఎదిగింది. ఆలోచనలు, ఒప్పందాలు, భాగస్వామ్యాలు వేగాన్ని పొందే ఉత్తేజభరిత వేవ్స్ ఫిల్మ్ బజార్, మాస్టర్‌క్లాసులు, సమర్పణ చిత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అంతర్జాతీయ పోటీలు లాంటి సమ్మేళనంతో ఐఎఫ్ఎఫ్ఐ ప్రత్యేకంగా మారుతోంది. నవంబర్ 20 నుంచి 28 వరకు గోవాలోని అద్భుతమైన తీరప్రాంతంలో నిర్వహించే ఐఎఫ్ఎఫ్ఐ.. భాషలు, విభాగాలు, ఆవిష్కరణలు, శ్రవణాల అద్భుతమైన కలయికను వీక్షకులకు అందించనుంది. ఇది ప్రపంచ వేదికపై భారతదేశ సృజనాత్మక ప్రతిభను తెలియజేసే ఒక ప్రత్యేక వేదికగా ఉంది.

## శిశువులకు టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలి : డాక్టర్ కోటిరత్నం



నల్గొండ, నవంబర్ 25:పుట్టిన ప్రతి శిశువుకు పూర్తి స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు అన్ని రకాల టీకాలు వంద శాతం సకాలంలో ఇవ్వడం ఆరోగ్య విభాగం ప్రధాన బాధ్యత అని సూర్యాపేట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోటి రత్నం అన్నారు. మంగళవారం గరిడేపల్లి పీహెచ్‌సీని ఆమె అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, కోల్డ్‌చైన్ పద్ధతులను సమగ్రంగా పరిశీలించారు. ఆస్పత్రిలోని వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేశ్, వీసీసీఎం లతీఫ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

ఖమ్మం, నవంబర్ 25: నవంబర్ 25: రాబోయే 3 సంవత్సరాలలో దేవరకొండ నియోజకవర్గంలో ఇండ్లు లేని నిరుపేదలకు పదివేల ఇండ్లు నిర్మించి ఇస్తామని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఈ రోజు ఆయన దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నేరేడుగోమ్ము, చందంపేట, చింతపల్లి మండలాలకు చెందిన 5 గ్రామాలలోని 115 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నదని తెలిపారు. అర్హత ఉండి ఇందిరమ్మ ఇండ్లు రాని లబ్ధిదారులకు లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఎంపిక చేయడం జరిగిందని, ఇల్లు రాకుండా మిగిలిపోయిన వారు నిరాశ పడవద్దని, అనంతరం వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లుపంపిణీ చేస్తామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం

హైదరాబాద్, నవంబర్ 25: మహిళలు చిత్తశుద్ధితో ముందుకెళ్లాలని మహిళ కోసం మహిళనే అండగా నిలబడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ రోజు ఆమె మండల పరిధిలోని పోరెడ్డి గూడెంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసాన్ని అందిస్తోందని కలెక్టర్ అన్నారు. మిర్యాలగూడ శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేందుకు ఉచిత బస్సు ప్రయాణంతోపాటు వడ్డీ లేని రుణాలు ఇందిరా మహిళ శక్తి చీరలు తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు.

ఇల్లు లేని నిరుపేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నదని వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం శాసనసభ్యులు, ఎమ్మెల్సీ జిల్లా కలెక్టర్ మహిళలకు ఇందిర మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ తాసిల్దార్ సరోజ పావని ఏపిఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులకు ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలి –కందా ప్రమీల

రైస్ మిల్లులకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాన్ని పెంచి ధానాన్ని వెను వెంటనే దిగుమతి చేసుకోవాలని తెలంగాణ మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమకు కేటాయించి ధాన్యం టార్గెట్ పూర్తయిందని రైస్ మిల్లుల యాజమాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతరం బుధవారం జరగనున్న దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పింజర్ల సైదులు, చెరుకు జానకి, ఊటూరి శ్రీకాంత్, చిలుకూరి ప్రమీల, గాదగోని లింగస్వామి, జ్యోతి, నాగమ్మ, అరుణ, యాదగిరి పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన విద్యార్థులు!

నర్సాపూర్ , నవంబర్ 25: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల పాఠశాల, కళాశాల నర్సాపూర్ విద్యార్థులు ఈ రోజు ప్రిన్సిపాల్ వైఖరికి నిరసనగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గత కొన్ని రోజులుగా పాఠశాల ప్రిన్సిపల్ బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ వారిని మానసికంగా వేధిస్తూ ఉండడంతో భయభ్రాంతులకు గురై విధి లేని పరిస్థితుల్లో ఈ రోజు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బైఠాయించారు.

అనంతరం పోలీస్ స్టేషన్ వెళ్లి ప్రిన్సిపాల్ వేధింపులు భయభ్రాంతులకు గురి చేస్తున్న వైనాన్ని ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా పాఠశాల ప్రిన్సిపాల్ బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ మానసికంగా వేధిస్తున్నారని తమ చదువులకు కూడా ఆటంకం ఏర్పడుతుందని వారు వాపోయారు. పాఠశాలలోని కొందరు విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని ఎదురు తిరిగితే చంపుతానని బెదిరించారని, ఈ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

పాఠశాలలో జరుగుతున్న విషయాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియనియకుండా తమను మానసికంగా బెదిరింపులకు కురిచేస్తున్నాడని అన్నారూ. ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

# తాష్కెంట్ పర్వతాల నుంచి స్లోవేకియాలోని మారుమూల గ్రామాల దాకా... ఐఎఫ్ఎఫ్ఐ 56వ ఎడిషన్‌లో వెండితెరపై అలరించిన మానవీయ కథలు

న్యూఢిల్లీ, నవంబర్ 25:భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవ 56వ ఎడిషన్ ప్రపంచవ్యాప్తంగా గల శక్తిమంతమైన కథనాలను, విభిన్నమైన ప్రపంచస్థాయి సినిమాలను ప్రదర్శిస్తూనే ఉంది. అంతర్జాతీయ చిత్రాల్లో ఉజ్బెక్ చిత్రం ఇన్ పర్సూట్ ఆఫ్ స్ప్రింగ్, స్లోవాక్ చిత్రం ఫ్లడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి.

ఈ రోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ రెండు చిత్రాల దర్శక–నిర్మాతలు, నటీనటులు తమ చిత్ర రూపకల్పన ప్రయాణాల గురించి తమ అనుభవాలను పంచుకున్నారు.

స్లోవేక్ చిత్రం "ఫ్లడ్" నిర్మాత కటారినా క్రనాకోవా మాట్లాడుతూ... ఈ చిత్రం నీటి రిజర్వాయర్ నిర్మాణం కోసం ఒక గ్రామం వలస ఆధారంగా రూపొందించారు. స్లోవేకియాలోని మజోవా ప్రాంతంలో చిత్రీకరించిన ఈ చిత్రంలో దాదాపు 80 శాతం మంది తారాగణం రుథేనియన్ మైనారిటీ కమ్యూనిటీకి చెందినవారు. "ఈ చిత్రం వెండితెరపై వారి సొంత భాషలో ప్రదర్శన ఇచ్చే అరుదైన అవకాశాన్ని రుథేనియన్ కమ్యూనిటీకి అందించింది" అని ఆమె వ్యాఖ్యానించారు.

అర్జెంటీనాలో జరిగిన చలనచిత్రోత్సవంలో తొలి ప్రదర్శన తర్వాత ఈ ఫ్లడ్ చిత్రం ఐఎఫ్ఎఫ్ఐ గోవాలో రెండో ప్రపంచస్థాయి ప్రీమియర్‌ను ప్రదర్శించింది. నిజ జీవిత ప్రాజెక్ట్ ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ద్వారా ఈ ప్రాజెక్ట్ ప్రభావిత కమ్యూనిటీల కోసం చిత్ర బృందం ప్రత్యేక స్క్రీనింగ్‌ను ప్లాన్ చేస్తోంది. ఉజ్బెక్ చిత్రం "ఇన్ పర్సూట్ ఆఫ్ స్ప్రింగ్" తరపున దర్శకుడు అయూబ్ షఖోబిద్దినోవ్, ప్రముఖ నటి ఫరీనా జుమావియాలు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని పరిచయం చేస్తూ... ఈ చిత్ర కథ ప్రధానంగా బాధాకరమైన జ్ఞాపకాలు, చాలా కాలంగా దాచి ఉంచిన రహస్యాలను చిత్ర ప్రధాన పాత్ర రహత్ షుకురోవా ఎదుర్కొనే ప్రయాణాన్ని హృద్యంగా చూపిస్తుందని దర్శకుడు తెలిపారు. "గతం తిరిగి కళ్లముందుకు వచ్చినప్పుడు తనతో తాను సయోధ్య కోసం రాహత్ పాత గాయాలు, దాచిన సత్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆయన వివరించారు. ఉజ్బెకిస్తాన్‌లో సోవియట్ శకం చివరి సంవత్సరాల్లో జరిగినప్పటికీ? ఈ చిత్ర ఇతివృత్తాలు, భావోద్వేగ పోరాటాలు నేటికీ సంబంధితంగా ఉన్నాయి. చిత్రరూపకర్తలకు వారి ప్రతిభను ప్రదర్శించడానికి, ప్రపంచ నెట్‌వర్క్‌లను నిర్మించడానికి ఒక విలువైన అంతర్జాతీయ వేదికను ఐఎఫ్ఎఫ్ఐ అందిస్తున్నదని దర్శకుడు ప్రశంసించారు. "ఐఎఫ్ఎఫ్ఐలో భాగం కావడం మాకు సంతోషంగా ఉంది" అని ఆయన అన్నారు.

తాష్కెంట్ నివాసి రహత్ షుకురోవా తన గతంలోని ఒకరి మరణం గురించి తెలుసుకుని, ఒకప్పుడు తాను ఉపాధ్యాయురాలిగా పనిచేసిన మారుమూల పర్వత గ్రామమైన ఆర్కలీకి తిరిగి వస్తుంది. దశాబ్దాల క్రితం సోవియట్ యుగంలో అవమానం, బహిష్కరణకు దారితీసిన ఒక కుంభకోణంతో ఆమె జీవితం ఛిన్నాభిన్నమైంది. ఇప్పుడు ఆర్కలీకి తిరిగి వచ్చిన ఆమె... బాధాకరమైన జ్ఞాపకాలను, చాలా కాలంగా దాచి ఉంచిన రహస్యాలను ఎదుర్కోవలసి వస్తుంది. గతం తిరిగి బయటపడుతున్నప్పుడు, రాహత్ తనతో తాను సయోధ్య కోరుతూ పాత గాయాలు, దాచిన సత్యాల ద్వారా తన మార్గాన్ని అన్వేషించాల్సి వస్తుంది.

మారా స్వస్థలమైన లోయలోని గ్రామాల భవిష్యత్తు కొత్త నీటి రిజర్వాయర్ ప్రాజెక్టు ద్వారా ప్రశ్నార్థకం అవుతుంది. గ్రామస్తులంతా క్రమంగా తమ ఇళ్లను వదిలి వెళ్ళవలసి వస్తుంది. మారా గ్రామీణ ప్రాంతాలను వదిలి పట్టణంలో చదువుకోవాలని కోరుకుంటుంది. అయితే రుథేనియన్ రైతు అయిన ఆమె తండ్రి ఆమెను వారసత్వంగా వస్తున్న భూమిని సాగు చేయడంలో ఉంచాడు. అంతం సమీపిస్తున్నప్పటికీ అతను దానిని వదులుకోవడానికి నిరాకరించాడు. మౌలిక సదుపాయాల లేమి, అధికారుల నుంచి భయం, రాబోయే వరదలకు వ్యతిరేకంగా పోరాడుతున్న గ్రామ సమాజంలో మారా తనను తాను కనుగొంటుంది.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం దక్షిణాసియాలోనే పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలుస్తుంది. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్... భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... గోవా రాష్ట్ర ప్రభుత్వం... గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ప్రపంచ సినిమాకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. ఇక్కడ అలనాటి అపురూప చిత్రాలు, సాహసోపేతమైన ప్రయోగాత్మక చిత్రాలు, లెజెండరీ మాస్ట్రోలు, నిర్భయంగా రూపొందించిన తొలి సినిమాలు ఒకే చోట కలిసి ఈ వేడుకలకు హాజరైన ప్రేక్షకులను అలరిస్తాయి. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, ఘన నివాళులతో పాటు... ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలకు అపార అవకాశాలను అందించే శక్తిమంతమైన వేవ్స్ ఫిల్మ్ బజార్ వంటి కార్యక్రమాలు ఐఎఫ్ఎఫ్ఐని మరింత అద్భుత వేదికగా మార్చుతున్నాయి. నవంబర్ 20?28 వరకు అందమైన గోవా తీరప్రాంతంలో ప్రదర్శితమయ్యే 56వ ఎడిషన్.... ప్రపంచ వేదికపై భారత సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించే ఒక అద్భుతమైన వేడుకగా... భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుత సంగమంగా నిలుస్తుంది.

# ఆర్‌టీఐహెచ్–పీబీ సిద్ధార్థ కళాశాల మధ్య ఎంవోయూ..

### –ఆవిష్కరణల ఆధారిత విద్యాభాగస్వామ్యానికి చొరవ

అమరావతి, నవంబర్ 25: ఆవిష్కరణల ఆధారిత విద్యా భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐ హెచ్)– విజయవాడ, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మధ్య మంగళవారం పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్–విజయవాడ సీఈవో జి.కృష్ణన్ కళాశాలలో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సహాయ సహకారాలు ఆర్‌టీఐహెచ్ ద్వారా అందుతాయన్నారు.



కొత్త ఆవిష్కరణలు దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం, సరైన మార్గనిర్దేశనం అందించడం, శిక్షణ కార్యకలాపాలు తదితరాలకు ఈ ఎంవోయూ దోహదం చేస్తుందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి దార్శనికత అయిన ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త దార్శనికతను యువత సరైన విధంగా అర్థం చేసుకొని.. ఆంత్రప్రెన్యూర్‌షిప్ దిశగా అడుగేయాలన్నారు. ఆర్‌టీఐహెచ్ అందిస్తున్న మద్దతను, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, స్టార్టప్ సంస్కృతిని, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు విద్యాసంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు.

# అంగన్వాడీల వేతనాలకు చట్టబద్ధత కల్పించాలి

ఆదిలాబాద్, నవంబర్ 25:అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ కు దేశవ్యాప్తంగా గౌరవంతో కూడిన సమాన వేతనం అందించి, న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ (సిఐటియు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు డిమాండ్ చేశారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్వాడీ ఉద్యోగుల ఐదవ రాష్ట్ర మహాసభలు ప్రారంభం కాగా పట్టణంలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

అనంతరం ఆర్ అండ్ బి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు, సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎం .సాయిబాబ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఏఆర్ సింధు మాట్లాడుతూ.. పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంతో పౌష్టికాహారం అందిస్తూ పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వాలు మొక్కుబడి వేతనాలు అందిస్తూ శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని విమర్శించారు.

ఇకపై అంగన్వాడీలు యాచించడం మాని హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. పాలకులు అంగన్వాడీల బలోపేతం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్టు ప్రకటిస్తున్నా ఆచరణలో అమలు కావడంలేదని సింధు అన్నారు. దేశవ్యాప్తంగా ఒకే గొడుగు కింద అంగన్వాడీలకు సమాన పసీఐటీయు జాతీయ కోశాధికారి సాయిబాబా మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అంగన్వాడీల పట్ల సవతి తల్లి ప్రేమ ఉలకం వస్తూ అబద్దాలతో ప్రచారం సాగించుకుంటున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ముందుండి పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర మహాసభల్లో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి వీ. జయలక్ష్మి, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ శ్రీ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కోశాధి కారి మంగ, టి ఏ జి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోసం సచిన్, బండి దత్తాత్రి, లంక రాఘువులు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం : మాదగోని శంకరయ్య

నల్గొండ, నవంబర్ 25: నిత్య యోగా సాధనతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రముఖ యోగా గురువు మాదగోని శంకరయ్య అన్నారు. నల్లగొండలోని చర్లపల్లిలో గల డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్– బీఈడీలో విద్యార్థులకు మంగళవారం 'యోగా అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి శిక్షకులుగా ఆయన హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి యోగా సాధన ఎంతో ముఖ్యమన్నారు. దానిని తెలియజేయాలనే ఉద్దేశంతోనే విద్యా శిక్షణ కళాశాలలో యోగా సబ్జెక్టును దేశవ్యాప్తంగా ఎన్‌సీఈఆర్‌టీ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దీనిలో భాగంగా తొలుత విద్యార్థులకు యోగా విశిష్టతతో పాటు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం పలు యోగాసనాలు వేసి చూపించి వాటి సాధన తీరును తెలిపి విద్యార్థులచే చేయించారు. ఈ సందర్భంగా శంకరయ్యను నిర్వాహ కులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవీఎం విద్యా శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గంగాధర్ రావు, బోళ్ల నారాయణరెడ్డి, ఎంఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణ, సీనియర్ అధ్యాపకులు ఆర్.సత్యనారాయణ, మేడిపల్లి రవి, ఎ.సరిత, శ్వేత, డీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, డీవీఎం విద్యాసంస్థల సూపరింటెండెంట్ చోలేటి శ్రీధర్ ఆచారి, కళాశాల ప్రోగ్రామర్ పి.శ్రీధర్ రెడ్డి, కళాశాల జూనియర్ అసిస్టెంట్ జె.విజయలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మూకాశ్మీర్ వృద్ధికి ఖనిజ సంపద కొత్త చోదకశక్తిగా మారాలి: కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 25:జమ్మూకాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో సున్నపురాయి ఖనిజ బ్లాకుల కోసం తొలివేలం ప్రక్రియను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఒమర్ అబ్దుల్లా, ఉప ముఖ్యమంత్రి శ్రీ సురీందర్ కుమార్ చౌదరితో కలిసి కేంద్ర బొగ్గు, గనుల మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జమ్మూలో ప్రత్యేక ప్రారంభ కార్యక్రమం, రోడ్‌షో నిర్వహించారు.

ఈ కీలక కార్యక్రమం 2015 గనులు, ఖనిజాల (అభివృద్ధి-నియంత్రణ) చట్టం (ఎమ్ఎమ్‌డీఆర్ చట్టం) కింద ప్రవేశపెట్టిన మైనింగ్ సంస్కరణల అమలులో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. ఖనిజ వనరుల కేటాయింపు కోసం పారదర్శక, డిజిటల్, వేలం ఆధారిత వ్యవస్థను అనుసరించే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సరసన జమ్మూ కాశ్మీర్‌కు ఇది స్థానం కల్పిస్తుంది.

అనంత్‌నాగ్, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో విస్తరించిన ఏడు సున్నపురాయి బ్లాకులను వేలానికి ఉంచారు. ఐక్యరాజ్యసమితి విధాన ప్రణాళిక వర్గీకరణ జీ3, జీ4 దశల కింద వర్గీకరించిన ఈ బ్లాకులు సుమారు 314 హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా సిమెంట్, నిర్మాణ రంగాల్లో గణనీయమైన పారిశ్రామిక ఆసక్తిని ఇవి పెంపొందిస్తాయని అంచనా.

ఎమ్ఎమ్‌డీఆర్ చట్టం సెక్షన్ 11లోని ఉపవిభాగాలు (4), (5) కింద నిర్వహిస్తున్న ఈ వేలం... జమ్మూ కాశ్మీర్ ఖనిజ సంపదను అందుబాటులోకి తేవాలని ఒక ప్రధాన ముందడుగును సూచిస్తుంది. ఇది ఇప్పుడు మొదటిసారిగా జాతీయ పోటీ బిడ్డింగ్ రంగంలోకి ప్రవేశిస్తోంది.

జమ్మూ కాశ్మీర్‌లో సున్నపురాయి వేలం కేంద్రపాలిత ప్రాంతాల విస్తృత అభివృద్ధిని ప్రోత్సాహించడం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు అనుగుణంగా ఉంది. ప్రధానమంత్రి పారిశ్రామిక అభివృద్ధి పథకం కింద ఉపాధి కల్పన, పారదర్శక పారిశ్రామిక ప్రక్రియలపై స్పష్టమైన దృష్టితో జమ్మూ కాశ్మీర్ అభివృద్ధి చెందుతున్న పెట్టుబడి కేంద్రాల సరసన స్థానం పొందుతోంది. జమ్మూ కాశ్మీర్ కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల్లో మెరుగుదలను చూస్తోంది. ఇవి మైనింగ్, అనుబంధ రంగాలకు మద్దతునిస్తాయి. విజయవంతమైన వేలం స్థానిక పరిశ్రమలకు ఊతమిస్తుందనీ, ఉపాధిని సృష్టిస్తుందని, జమ్మూ కాశ్మీర్‌లో వేగవంతమైన ఆర్థిక వృద్ధిని సాధించాలనే ప్రభుత్వ లక్ష్యానికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రాంతానికి ఒక పరివర్తనాత్మక ముందడుగుగా ఈ వేలం ప్రక్రియను అభివర్ణించారు. ఉపాధి కల్పన, పారిశ్రామిక వృద్ధి, స్థానిక సమాజాలకు దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక ప్రయోజనాలకు ఈ ఖనిజ అభివృద్ధి దారితీస్తుందని నిర్ధారించడంలో ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేస్తుందని, ఈ ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిస్తుందనీ, యువత ఉపాధికి... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మద్దతునిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి శ్రీ సురిందర్ కుమార్ చౌదరి ఈ రంగానికి సంబంధించిన వ్యక్తులు, సంస్థలను అభినందించారు. ఈ సంస్కరణను ముందుకు తీసుకెళ్లడంలో కేంద్రం, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ సహకారం పాత్రను ప్రధానంగా ప్రస్తావించారు.

రోడ్‌షోలో భాగంగా ఎమ్ఈసీఎల్ గుర్తించిన బ్లాకుల సాంకేతిక, భౌగోళిక అంచనాలను సవివరంగా ప్రదర్శించారు. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లావాదేవీల విధాన ప్రణాళికను రోడ్ షో వివరించింది. ఎమ్ఎస్‌టీసీ ఇ-వేలం ప్రక్రియను ప్రదర్శించింది, సంభావ్య బిడ్డర్లకు తగినంత సమాచారం, మద్దతు లభించేలా చూసుకుంది.

టెండర్ డాక్యుమెంట్ల అమ్మకం ఈ నెల 28న ప్రారంభమవుతుంది. వచ్చే నెల 12న ప్రీ-బిడ్ సమావేశం జరుగుతుంది. టెండర్ డాక్యుమెంట్ల కొనుగోలుకు చివరి తేదీ 2026, జనవరి 19. ఎమ్ఎస్‌టీసీ ఆన్‌లైన్ వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా బిడ్‌లు సమర్పించడానికి చివరి తేదీ 2026, జనవరి 20.

ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ పారదర్శకత, సాంకేతికత ఆధారిత నియంత్రణ, స్థిరమైన వనరుల వినియోగం పట్ల నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. స్వయం-సమృద్ధ ఖనిజ రంగం దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో, వికసిత్ భారత్-2047 విస్తృత జాతీయ లక్ష్యానికి, జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ఇది దోహదపడుతుంది.

# 56వ ఇఫిలో ఎన్ఎఫ్‌డీసీ-ఎన్ఎఫ్ఏఐ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన మూకీచిత్రం 'మురళీవాలా' ప్రత్యేక ప్రదర్శన

న్యూఢిల్లీ, నవంబర్ 25: ఇఫి నాలుగో రోజు పునరుద్ధరించిన క్లాసిక్ చిత్రాల్లో ఒకటైన 'మురళీవాలా' ప్రత్యేక ప్రదర్శనతో ప్రేక్షకులు కాలయానం అనుభూతిని పొందారు. జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ), నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఇండియా (ఎన్ఎఫ్‌డీసీ) కలిసి నేషనల్ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్ (ఎన్ఎఫ్‌హెచ్ఎం) కింద 18 క్లాసిక్ చిత్రాలకు మళ్లీ జీవం పోశాయి. వీటిని ఈ ఏడాది ఇఫి కోసం ఇండియన్ పనోరమా ప్రత్యేక ప్యాకేజీ రూపొందించింది. ఇందులో హిందీ, తెలుగు, మలయాళం, బెంగాలీ, మరాఠీ భాషల సినిమాలు ఉన్నాయి. విశాలమైన కళాత్మక వ్యక్తీకరణల పరిధిని ఈ చిత్రాలు ప్రతిబింబిస్తాయి. ఈ చిత్రాలన్నింటినీ దాని అసలైన సృజనాత్మక ఉద్దేశానికి గౌరవమిస్తూ, కఠినమైన ఆర్కైవల్ ప్రమాణాలతో భద్రపరిచారు.

ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ మాగ్దం ఈ ప్రత్యేక ప్రదర్శన ఉద్దేశాన్ని వివరించారు. "నేటి తరానికి మూకీ చిత్రాల అనుభవాన్ని తిరిగి తీసుకురావడమే మా లక్ష్యం. ఈ ప్రదర్శనలో, సంగీత విద్వాంసులు ముందు వరుసలో కూర్చుని ప్రేక్షకుల కోసం ప్రత్యక్ష సంగీతాన్ని అందిస్తారు. ప్రతిభావంతుడైన రాహుల్ నాయకత్వంలో స్ఫూర్తి, అదే వైభవంతో మళ్లీ జీవం పోసుకుంటుందని నేను ఖచ్చితంగా చెప్పగలను" అని ఆయన అన్నారు.

సంగీత దర్శకుడు రాహుల్ రనాడే మాట్లాడుతూ.. "98 సంవత్సరాల క్రితం రూపొందిన చిత్రానికి సంగీతాన్ని పునర్నిర్మించడం, దానిని ప్రత్యక్షంగా ప్రదర్శించడం నాకూ, నా బృందానికి గొప్ప గౌరవంతోపాటు పెద్ద సవాలు కూడా. 1927లో బాబురావ్ గారు రూపొందించిన సినిమా ఎలాంటిదో, ఆయన సృష్టించిన ప్రత్యేక ఎఫెక్ట్‌లు ఎలాంటివో మీరు అనుభూతి చెందబోతున్నారు. దీనికి నేను, నా బృందం న్యాయం చేయగలుగుతామని ఆశిస్తున్నాను.

దివంగత సినీ నిర్మాత, కళాకారుడు బాబూరావు పెయింటర్ రూపొందించిన చిత్రం 'మురళీవాలా' (1927). ఇది మిగిలి ఉన్న అతి కొద్ది భారతీయ మూకీ చిత్రాల్లో ఒకటి. దీనిని ఎన్ఎఫ్‌హెచ్ఎం అత్యంత అరుదైన నిధుల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ ప్రదర్శన ప్రేక్షకులకు 1920ల నాటి సినిమా ప్రదర్శనను గుర్తు చేసే భావానుభూతిని అందించింది.

ఈ సంవత్సరం చలనచిత్ర ప్రదర్శన అనేక చారిత్రక అంశాలతో కూడి ఉంది. వీ శాంతారామ్ గారి 125 సంవత్సరాల వారసత్వానికి ఈ చిత్రోత్సవం గౌరవం అందిస్తుంది. అలాగే దేశ సినీ పరిశ్రమకు మార్గదర్శకం చేసిన దిగ్గజాలు గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, భూపెన్ హజారికా, పి. భానుమతి, సలీల్ చౌధురి, కె. వైకుంఠ్ గార్ల 100వ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక నివాళులు అర్పిస్తున్నారు. ఆధునిక భారతీయ సినిమా రూపురేఖలను తీర్చిదిద్దడంలో ఎన్ఎఫ్‌డీసీ పోషించిన పాత్రను గుర్తిస్తూ.. సంస్థ 50 సంవత్సరాల వేడుకను కూడా జరుపుకుంటుంది. భారతీయ కథనంపై దార్శనిక దర్శకుడు శ్యామ్ బెనగల్ చూపిన ప్రభావాన్ని వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఆయన రూపొందించిన "సుస్మాన్" చిత్రానికి ప్రత్యేక నివాళి అర్పిస్తున్నారు.

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 2016లో ప్రారంభమైన నేషనల్ ఫిల్మ్ హెరిటేజ్ మిషన్.. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, ముఖ్యమైన చలనచిత్ర వారసత్వ పరిరక్షణ కార్యక్రమాల్లో ఒకటిగా నిలుస్తోంది. దేశ చలనచిత్ర వారసత్వాన్ని రక్షించడమే దీని ప్రధాన లక్ష్యం. అంటే కెమెరా నెగటివ్‌లు, విడుదల ప్రింట్లు, అరుదైన ఆర్కైవల్ సంపదలు మొదలైనవన్నింటినీ భద్రపరచడం, కాపాడటం, డిజిటల్ రూపంలోకి మార్చడం, పాత చిత్రాలను మళ్లీ కొత్తగా మార్చడం దీని లక్ష్యం. వీటిని హక్కుదారులు, వ్యక్తిగత సేకరణదారులు, అంతర్జాతీయ సంస్థలు వంటి వివిధ వనరుల నుంచి సేకరిస్తారు.

ఇఫి 2025 కోసం పునరుద్ధరించిన భారతీయ చలనచిత్రాలు ఎన్ఎఫ్‌హెచ్ఎం కృషికి నిదర్శనంగా నిలుస్తాయి. ప్రతి దృశ్యాన్ని ఎంతో శ్రద్ధతో పునరుద్ధరించారు. రంగుల క్రమబద్ధీకరణ కూడా చాలా ఖచ్చితత్వంతో చేశారు. అనేక సందర్భాల్లో స్వయంగా దర్శకులు, సినిమాటోగ్రాఫర్లు లేదా వారి సన్నిహిత సహచరుల మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియ పూర్తయ్యింది.

ఈ చిత్రోత్సవంలో రిత్విక్ ఘటక్ దర్శకత్వం వహించిన "సువర్ణరేఖ" సినిమా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎన్ఎఫ్‌డీసీ?ఎన్ఎఫ్ఏఐ సేకరణలో ఉన్న 35ఎంఎం మాస్టర్ పాజిటివ్ నుంచి దీనిని పునరుద్ధరించగా.. తుది రంగుల క్రమద్ధీకరణ పనులను ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అవిక్ ముఖోపాధ్యాయ్ పర్యవేక్షించారు.

ముజఫర్ అలీ దర్శకత్వం వహించిన ఉమ్రావ్ జాన్ కూడా విశేషంగా పునరుద్ధరించారు. సినిమా అసలు నెగటివ్ తిరిగి మార్చలేని విధంగా దెబ్బతినడం వల్ల భద్రపరిచిన 35 ఎంఎం విడుదల ప్రింట్ నుంచి దీనిని పునరుద్ధరించారు. దర్శకుడు ముజఫ్ఫర్ అలీ స్వయంగా కలర్ గ్రేడింగ్ ప్రక్రియను పర్యవేక్షించడం ద్వారా చిత్రానికి ప్రత్యేకమైన రంగుల సౌందర్యం యధాతథంగా నిలిచింది.

ఈ పునరుద్ధరణలు దేశ సినీ చరిత్రలో అత్యంత దిగ్గజాల వారసత్వానికి గౌరవిస్తాయి. తమ సినీ వారసత్వాన్ని కాపాడుకోవాలనే దేశ సంకల్పాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. ఈ సినిమాల్లో పొందుపరిచిన సాంస్కృతిక, చారిత్రక, కళాత్మక కథనాలు కొత్త తరాలకు కూడా చేరువయ్యేలా చేస్తున్నాయి.






# నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



మహబూబాబాద్, నవంబర్ 25: పెద్దవంగర మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న 33/11 కెవి నూతన ఉపకేంద్రం నిర్మాణ పనులకు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి వారితో పాటు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డి పాల్గొని శంకుస్థాపన భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉపకేంద్రం నిర్మాణం పూర్తయిన తరవాత పెద్దవంగర మండలంలోని గ్రామాలన్నింటికి నిరవధిక, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని, రైతులకు, చిన్న చిన్న పరిశ్రమలకు, గృహాలకు పెద్ద ఎత్తున లాభం కలుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఎదుర్కొన్న వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు పూర్తిగా తగ్గిపోతాయని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలు మాత్రమే కాకుండా, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాల మెరుగుదల కూడా ముఖ్యమని వారు అన్నారు. విద్యుత్ రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, ఆధునీకరణ కార్యక్రమాలు రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజలు, రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలి : -ఏఐకేఎంఎస్

నల్గొండ, నవంబర్ 25: పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ అధికారులు అమలు చేస్తున్న కఠిన నిబంధనల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం శ్రామిక భవన్‌లో జరిగిన ఏఐకేఎంఎస్ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి పంటను భారీ పెట్టుబడులతో పండించిన రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకు వెళ్లినప్పుడు తేమ శాతం, నాణ్యత పేరుతో అధికారులు అనేక నిబంధనలు విధించడం రైతులకు శాపంగా మారిందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా తేమ శాతం తగ్గడం సహజమైతే, ఈ అంశాన్ని పట్టించుకోకుండా అధికారులు కఠిన నిబంధనలు పెట్టడం రైతులను కష్టాల్లోకి నెట్టడమేనన్నారు.

ఎకరానికి ఏడు క్వింటాళ్ల నిబంధన తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రాల్లో రైతులు వారాల తరబడి నిరీక్షిస్తున్నారని, చేసేది లేక ప్రైవేట్ దళారులకు అమ్మి మోసపోతున్నట్లు తెలిపారు. మరోవైపు కాపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన లేక స్లాట్ బుక్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. మిల్లుల్లోకి వెళ్లిన తర్వాత తేమ శాతం పేరుతో రూ.500 పైగా కటింగ్ పెడుతున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు వెల్లడించారు.

# కేసీఆర్ సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్గొండ, నవంబర్ 25: రెండేళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మోసపు హామీలను అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా లారీకి 1.5 క్వింటాలు కోతలు పెట్టి వేధిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో 100 పడకల దవాఖాన భవనానికి, అలాగే శ్రీ చెన్నకేశ్వరస్వామి దేవాలయానికి రూ.2.5 కోట్లు మంజూరు చేయించి శంఖుస్థాపనలు చేసినా నేటికి పనులు ప్రారంభించలేదన్నారు. కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారని, రేవంత్ ప్రభుత్వం మాత్రం సంఘబంధ సభ్యులకే చీరెలు పంపిణీ చేస్తుండడంతో మహిళలు గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు కాలయాపన చేయడంతో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తేలిందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బందెల రాములు, రైతు సమన్వయ సమతి మండల మాజీ అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, వేమవరపు సుధీర్ బాబు, దోమల సతీశ్, గొరిగె నర్సింహ్మ, పున్న వెంకటేశం, బద్దుల రమేశ్, మాజీ సర్పంచులు మెట్టు మహేందర్‌రెడ్డి, కోళ్లస్వామి, బందెల యాదయ్య, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పోతరాజు సాయికుమార్, జాడ సంతోష్, నాయకులు ఎన్‌కే చాంద్, ఇడెం శ్రీనివాస్, బత్తుల వెంకటేశం, గర్దాసు విక్రమ్, పోతరాజు శంకరయ్య, ఆవుల నరేందర్, కోళ్ల కిషన్, మామిండ్ల అశోక్, బండ శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల శ్రీధర్, బొల్లం సతీశ్, జంగిలి నర్సింహ్మా పాల్గొన్నారు.

# జనవరి 1 నుంచి సాహిత్య సాంస్కృతికోత్సవాలు.. అలరించనున్న నాటక ప్రదర్శనలు




వరంగల్, నవంబర్ 25: అజోవిభో కందాళం ఫౌండేషన్ (అమెరికా), వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహరబాబు, సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతరావు తెలిపారు.

మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాటాడుతూ.. 32 సంవత్సరాలుగా ప్రతీ యేటా మూడురోజుల పాటు రాష్ట్రస్థాయి సాంఘీంక నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు, ఈ నాటిక పోటీల్లో అన్నీ కొత్త నాటికలే ఉంటాయన్నారు. ప్రదర్శనకు ఎంపికైన నాటికలను పుస్తకరూపంలో ప్రచురించడం, రచయితలను నగదు బహుమతితో సత్కరించడం ఈ పోటీల ప్రత్యేకతని చెప్పారు. ప్రతిరోజూ మొదటి ప్రదర్శన తర్వాత నాటక రంగానికి విశిష్ట సేవలందించిన కళాకారుడికి సేవామూర్తి పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు.

2026 ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం సీకేఎం విశ్రాంత ఉపన్యాసకులు, రచయిత డాక్టర్ గుంజి వెంకటరత్నంకు రూ.లక్ష అందజేయనున్నట్లు, విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారం(2026) కవి, కథకుడు, నవలారచయిత రామా చంద్రమౌళికి రూ.50 వేలు, 'సరిలేరు నీకెవ్వరు' విశిష్టరంగస్థల పురస్కార గ్రహీత కోట్ల హనుమంతరావుకు రూ.25 వేలు అందజేసి ఘనంగా సత్కరించనున్నట్లు వారు తెలిపారు.

మూడురోజులు ప్రత్యేకంగా ఉభయ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన తెలుగు కథానాటికల ప్రదర్శన ప్రతిరోజు మూడు నాటికలు మొత్తం 9 నాటికల ప్రదర్శలు, ప్రతిరోజు మూడు రంగస్థల సేవ చేసిన ఒక వ్యక్తికి రూ.10 వేల చొప్పున రంగస్థల [illegible] అందజేయనున్నట్లు తెలిపారు. పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖులు ముగ్గురి సాహిత్యాల విశ్లేషణలు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 1 గంటల వరకు సాహిత్య సమాలోచన సదస్సులు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ఆచార్య డీఎస్ఎన్ మూర్తి, రామకోటేశ్వరరావు, ఏవీ నరసింహారావు, కె.కృష్ణమూర్తి, న్యాలకొండ భాస్కరరావు పాల్గొన్నారు.

# వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ

నర్సంపేట, నవంబర్ 25: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో వివిధ మహిళా సంఘాలకు 3.39 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఈ చెక్కులను అందజేశారు.నర్సంపేట డివిజన్ లోని 4006 మహిళా సంఘాలకు గాను మూడు కోట్ల 39 లక్షల రూపాయల చెక్కులను మహిళలకు అందజేశారు. నర్సంపేట మండలానికి 825 సంఘాలకు 76 లక్షల రూపాయలను సంఘ సభ్యులకు చెక్కుల రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిఆర్డిఓ రామ్ రెడ్డి,ఆర్డీవో ఉమా రాణి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, డీపీఎంలు అనిల్, శంకర్, ఆరు మండలాల ఏపీఎంలో మండల సమాఖ్య అధ్యక్షులు, తాసిల్దారులు లబ్ధిదారులు సభ్యులు పాల్గొన్నారు.

# డీసీఎల్ ఆఫీస్ వద్ద ధర్నా

సంగారెడ్డి నవంబర్ 25: నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డీసీఎల్ కార్యాలయంఎదుట ధర్నా నిర్వహించి అనంతరం ఏఎల్ఓ నీరజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ రెహమాన్, వెంకట్రాజ్యం మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు.ఇన్సూరెన్స్ కంపెనీలను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నేరుగా కార్మికులకు బీమా సౌకర్యాన్ని అందించాలని చెప్పారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు వేసిన రూ.700 కోట్లవెంటనే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని అన్నారు. ఆరోగ్య పరీక్షల పేరిట ప్రతి కార్మికుడి పేరుపై ప్రభుత్వం దగ్గర నుంచి రూ.3500 నిలువు దోపిడీ చేస్తోందని ఆరోపించారు.

సీఎస్సీ సంస్థను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, 60 ఏండ్లు దాటిన కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వడంతోపాటు పిల్లల చదువులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని తెలిపారు.లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మి, నర్సింలు, బంజారా నాగులు, లక్ష్మి, కల్పన, దుర్గమ్మ, మాధవి, నీలమ్మ, యాదయ్య, రాజు, కిరణ్, కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

